# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
19-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 117

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## మందుబాబులకు 'ఫుట్ బాల్' పండగ!

భాగ్యనగరంలో తెల్లవారుజాము వరకు మద్యం

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

భాగ్యనగరంలో ఫుట్బాల్ ఫీవర్ కొనసాగుతోంది. ఫిఫా వరల్డ్ కప్ ఫీవర్ పతాక స్థాయికి చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది చూపు హైదరాబాద్ పై పడింది. ఈ మెగా టోర్నమెంట్ ముగింపు వేడుకల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక రంగాలకు, క్రీడాభిమానులకు ఊరట ఇచ్చే విధంగా ఈ నిర్ణయం ఉంది.థర్డ్ ప్లే ఆఫ్, ఫైనల్ మ్యాచ్ లను వీక్షించే ఫుట్ బాల్ అభిమానులకు బ్రహ్మాండమైన మినహాయింపు వచ్చింది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఫిఫా వరల్డ్ కప్ తో పాటు లిక్కర్ ను కూడా ఎంజాయ్ చేసేలా నిర్ణయం తీసుకుంది తెలంగాణ ప్రభుత్వం. క్లబ్బులు, బార్లు, మైక్రో బ్రూవరీల మధ్య అమ్మకాల సమయాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం అధికారికంగా



## రవాణాశాఖ నిబంధలను కఠినతరం

**నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నజర్**

**తనిఖీలు ముమ్మరం చేయనున్న అధికారులు**

హైదరాబాద్,జూలై18:రాష్ట్రవ్యాప్తంగా రవాణా నిబంధనలను కఠినతరం చేశారు. ఉల్లంఘించే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని

2లో

# జానీ మాస్టర్.. మళ్లీ టార్గెట్

### టాలీవుడ్ లో రచ్చకెక్కిన డాన్స్ మాస్టర్ల పోరు

### జానీని ఒంటరిని చేసేందుకు ప్రయత్నాలు

టాలీవుడ్ టాప్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ మళ్లీ టార్గెట్ అయ్యారా? ఆయనను మరోసారి జైలుకు పంపేందుకు ప్రత్యర్థులు ప్రయత్నిస్తున్నారా? అంటే ఫిలింగనర్ వర్గాల నుంచి అవుననే సమాధానాలే వస్తున్నాయి. తెలుగు సినీ పరిశ్రమలోనే కాకుండా మొత్తం దక్షిణాదిలోనే టాప్ కొరియోగ్రాఫర్ గా ఎదిగిన జానీ మాస్టర్ గతంలో లైంగిక వేధింపుల ఆరోపణలతో జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే.

- ప్రత్యర్థులకు ఫిలిం ఫెడరేషన్ పెద్దల అండ
- ఇప్పటికే జానీకి షోకాజ్ నోటీసులు జారీ
- మరోసారి జైలుకు పంపిస్తారంటూ ప్రచారం
- ఆయన భార్య సుమలతపైనా కుట్రలు
- డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి
- నుంచి తొలగించేలా వ్యూహరచన

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

అయితే ఇందుకు ఆయన పాల్పడ్డ లైంగిక వేధింపుల కంటే డాన్సర్స్ అసోసియేషన్ లో ప్రత్యర్థులతో నెలకొన్న ఆధిపత్య పోరే కారణమన్న అభిప్రాయాలు ఉన్నాయి.

- మిగతా 2వ పేజీలో



2లో



## వరుణుడి కరుణ కోసం...!

**తెలంగాణ వ్యాప్తంగా వరుణ యాగాలు, హోమాలు**

**రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఖరీఫ్ పై ప్రభావం చూపుతోంది. కనీస స్థాయిలో కూడా సాధారణ వర్షపాతం నమోదు కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో కరువు పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు స్వచ్ఛందంగా సాగు నుంచి తప్పుకుంటున్నారు. వరుణుడి కరుణ కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

**ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా కమిటీ కుర్రోళ్లు ఎంపి**

**విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులు**

న్యూఢిల్లీ,జూలై18: 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ




### దొరల గడీల ముందు

## మోకరిల్లని కవి అందెశ్రీ

అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్

వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు

నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల

నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు

అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు

2లో

## ఏపీ సెటిలర్స్‌కు పెద్ద చిక్కు!

### ఒకచోట ఓటు అనివార్యం

**స్వగ్రామంలో వదులుకుంటే అన్నింటికీ నష్టం**

**హైదరాబాద్ లో లేకుంటే తగ్గనున్న ప్రాధాన్యం**

**చివరకు సొంత రాష్ట్రం వైపే మొగ్గు**

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** హైదరాబాదులో ఉన్న ఏపీ సెటిలర్స్ కు పెద్ద చిక్కు వచ్చి పడింది. ఎక్కడో ఒకచోట మాత్రమే ఓటు ఉంచుకునే అనివార్య పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సమగ్ర ఓటరు సర్వే ప్రక్రియ

2లో




## పాకిస్తాన్‌కు షాక్!

**స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న బలుచిస్తాన్**

**ప్రత్యేక జాతీయ గీతం తో పాటు కరెన్సీ కూడా ఖరారు**

**దశాబ్దాల దోపిడీపై ఉద్యమకారుల కీలక నిర్ణయం**



3లో

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** పాకిస్తాన్ కు షాక్ తగిలింది. బలుచిస్తాన్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. అణచివేత, నరమేధాన్ని తట్టుకోలేక బలుచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ఇండిపెండెంట్ గా ప్రకటించుకుంది.


### తుంగభద్ర పరివాహక

## రాష్ట్రాలతో భేటీ

**27 హైదవర్ కమిటీ తొలి సమావేశం**

**నీటి సమస్యలపై చర్చించనున్న కమిటీ**

అమరావతి,జూలై 18(ఆర్ఎన్ఎ): తుంగభద్ర పరీవాహక ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న



## బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

**బహద్దూర్ గూడ వద్ద తీవ్ర ఉద్రిక్తత**

**అధికారుల తీరుపై రైతుల మండిపాటు**

**భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరిక**

**ఐదురోజులుగా కొనసాగుతున్న ఆందోళన**



3లో

రంగారెడ్డి,జూలై18(ఆర్ఎన్ఎ) : శంషాబాద్ బహదూర్ గూడలో ఉద్రిక్తత నెలకొంది. బుల్లెట్ ట్రైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. బహదూర్ గూడా భూముల దగ్గరకు హైడ్రా అధికారులు భారీగా చేరుకున్నారు. భూముల వ్యవహారంలో ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగుతోంది. స్పష్టమైన




# జానీ మాస్టర్.. మళ్లీ టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం అసోసియేషన్ లో మళ్లీ అదే వాతావరణం నెలకొనడంతో మరోసారి జానీని జైలుపాలు చేసేందుకు వ్యూహరచన చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించాడని, తాను మైనర్ గా ఉన్నప్పుడు అత్యాచారానికి పాల్పడ్డాడని ఆయన వద్ద అసిస్టెంట్ గా పనిచేసిన శ్రష్టి వర్మ గతంలో ఆరోపణలు చేయడం, దీంతో పోలీసులు జానీపై పోక్సో కేసు పెట్టి జైలుకు పంపడం తెలిసిందే. ఈ కారణం చూపించి అప్పుడు టాలీవుడ్ డాన్సర్స్ అసోసియేషన్ కు అధ్యక్షుడిగా ఉన్న జానీని ఆ పదవి నుంచి తొలగించారు. అంతేకాకుండా.. జానీకి వచ్చిన జాతీయ అవార్డును సైతం నిలిపివేశారు. ఆయన బెయిలుపై విడుదలయ్యాక సినిమాల్లో కొరియోగ్రఫీ అవకాశాలు కూడా రాకుండా చేయాలన్న కుట్ర జరిగినట్లు ఆరోపణలున్నాయి. అయితే రామ్ చరణ్ వంటి కొందరు హీరోలు ఇవేవీ పట్టించుకోకుండా జానీకి అవకాశాలు ఇవ్వడంతో ఆయన మళ్లీ నిలదొక్కుకున్నారు. అంతేకాకుండా.. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి అన్నట్లుగా తిరిగి డాన్సర్స్ అసోసియేషన్ పై తన పట్టు సాధించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎదురైన అవాంతరాలను అధిగమించి తన భార్య సుమలతను అధ్యక్షురాలిగా నిలబెట్టి గెలిపించుకున్నారు.

**సుమలత గెలిచిన నాటి నుంచే..**

డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన సుమలత.. అందులో జరుగుతున్న అవకతవకలను, ప్రత్యర్థి ప్యానల్ నుంచి గెలిచిన సభ్యులు చేస్తున్న చర్యలను ప్రశ్నించారు. ఇందుకు సమాధానం చెప్పలేని ప్రత్యర్థులు రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించారు. ఒకేసారి 10 మంది సభ్యులు తమ పదవికి రాజీనామా చేశారు. దీంతోనైనా తమకు ప్రశ్నించడం మానుకుంటారని భావించారని, అయితే వారి రాజీనామాను సుమలత ఆమోదించడంతోనే వివాదం మొదలైందని అసోసియేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఆ 10 స్థానాలకు ఉప ఎన్నిక నిర్వహించాలని సుమలత నిర్ణయించగా.. శేఖర్ మాస్టర్ వర్గం నుంచి ప్రతిఘటన ఎదురవడంతో అది కాస్తా ఘర్షణకు దారితీసింది. దీంతో అసోసియేషన్ లో జరిగిన అవకతవకలను జానీ మాస్టర్, సుమలత మీడియా ఎదుట వెల్లడించారు. దీంతో ఆగ్రహానికి లోనైన ప్రత్యర్థులు జానీ మాస్టర్ దంపతులపై ఫిలిం ఫెడరేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫెడరేషన్ లోని 24 యూనియన్లలో డాన్సర్స్ అసోసియేషన్ కూడా ఒకటిగా ఉన్న నేపథ్యంలో ఫెడరేషన్ పెద్దలు జానీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

**ప్రత్యర్థులకు ఫిలిం ఫెడరేషన్ అండ?**

జానీ స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ ఫిలిం ఫెడరేషన్ సూచించగా.. తనను విచారించే అధికారం ఫెడరేషన్ కు లేదని జానీ మాస్టర్ అన్నారు. దీనికి ఆగ్రహం చెందిన ఫెడరేషన్ పెద్దలు వారం రోజుల్లో క్షమాపణ చెప్పాలంటూ హుకుం జారీ చేశారు. అప్పటివరకు ఆయన కొరియోగ్రఫీ చేసే సినిమాలకు ఇతర క్రాఫ్టుల వారెవరూ పనిచేయబోరని ప్రకటించారు. అంతేకాదు.. వారం తరువాత జానీపై తీవ్రమైన చర్యలు ఉంటాయని, ఆయన భార్య సుమలతపైనా చర్యలుంటాయని హెచ్చరించారు. దీంతో జానీపై మరో కొత్త ఆరోపణల్ని తెరపైకి తెచ్చే ప్రయత్నం జరుగుతోందని ఆయన మద్దతుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జానీపై లైంగిక ఆరోపణలు చేసిన శ్రష్టి వర్మ ప్రస్తుతం టాలీవుడ్ లోనే కొనసాగుతుండడం, పలు సినిమాలకు కొరియోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో.. జానీపై మళ్లీ ఆమెను ప్రయోగించాలనే ప్రయత్నం జరుగుతోందని అంటున్నారు. అయితే జానీ మాస్టర్ దంపతులు మాత్రం.. అసోసియేషన్ లోని కొందరు సభ్యులు డాన్సర్ల పేరు చెప్పి నిర్మాతల వద్ద నుంచి డబ్బులు తీసుకొని వారే వాడుకున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని లేఖ ద్వారా నిర్మాతల దృష్టికి తీసుకెళ్లారు. అలాంటి వారిపై చర్య తీసుకునేలా నిర్మాతలు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. మరి ఈ ప్రయ్నతంలో జానీ విజయం సాధిస్తారా? లేక మరోసారి ప్రత్యర్థుల చేతిలో చిత్తయి.. మళ్లీ జైలు పాలవుతారా? అన్నది చూడాల్సి ఉంది.

# మందుబాబులకు 'ఫుట్ బాల్' పండగ!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులను జారీ చేసింది. ప్రత్యేక విజ్ఞప్తితో.. హైదరాబాదులో ఫుట్బాల్ అంతర్జాతీయ మ్యాచ్ల నేపథ్యంలో.. తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ తెలంగాణ ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి చేసింది. మద్యం అమ్మకాలకు సంబంధించి సమయాన్ని పెంచాలని కోరింది. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభం కానున్న కీలక మ్యాచ్లను.. క్రీడాభిమానులు వీక్షించేలా.. ఎంజాయ్ చేసేలా.. గ్రూపులుగా చేరి మ్యాచ్లను వీక్షించేలా సమయాన్ని కేటాయించాలని కోరింది. ఈ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించింది తెలంగాణ ప్రభుత్వం. ఈరోజు రాత్రి నుంచి ఆదివారం ఉదయం నాలుగు గంటల 30 నిమిషాల వరకు మద్యం అమ్మకాలకు వెసులుబాటు కల్పించింది. జూలై 19న జరిగే తుది పోరును పురస్కరించుకొని జూలై 20 సోమవారం తెల్లవారుజామున మూడు గంటల వరకు బార్లు, క్లబ్బులు, మైక్రో బ్రోవరీస్ తెరిచి ఉంచనున్నట్లు స్పష్టం చేసింది.

**కేవలం ఆ పరిధిలోనే..**

తాజాగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఈ వేసులుబాటు భాగ్యనగరం వరకు మాత్రమే. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోకి వచ్చే హైదరాబాద్,, సికింద్రాబాద్, సైబరాబాద్ ప్రాంతాల్లో గుర్తింపు పొందిన 2బి బార్లు, సీ 1 క్లబ్బులు, మైక్రో బ్రోవరీస్ కు మాత్రమే వర్తిస్తుందని.. రాష్ట్రవ్యాప్తంగా వర్తింపు ఉండదని స్పష్టం చేసింది. అయితే ఈ అదనపు సమయంలో కూడా శాంతి భద్రతలకు ఏమాత్రం విఘాతం కలగకుండా.. ఎక్సైజ్ శాఖ నిబంధనలను కచ్చితంగా పాటించాలని యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు అయితాయి. స్వతహాగా ఫుడ్ బాల్ క్రీడాకారుడు అయిన రేవంత్ రెడ్డి.. హైదరాబాదులో ఫుట్బాల్ కి ఉన్న క్రేజ్ ను బట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు.

# వరుణుడి కరుణ కోసం...!

ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల కోసం ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేకంగా పూజలు, వరుణ యాగాలు, శాంతి పూజలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని స్వయంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు.

**తీవ్ర వర్షాభావం..**

సాధారణంగా నైరుతి రుతుపవనాల ప్రభావం జూన్, జూలై నెలల్లో ఉంటుంది. ఈ ఏడాది రాష్ట్రానికి ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించాయి. అయినా సరే పెద్దగా ప్రభావం చూపలేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. వరి దమ్ములు ప్రారంభం కాలేదు. ప్రాజెక్టుల్లో కనీస స్థాయిలో కూడా నీరు లేదు. మరోవైపు విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ఆ వినియోగానికి తగ్గట్టు సరఫరా లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం అదనంగా విద్యుత్ కొనుగోలు చేస్తోంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో దేవుడు పై భారం పెడుతోంది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల్లో వరుణయాగాలు చేయాలని నిర్ణయించింది. తెలంగాణలో వ్యవసాయ రంగానికి ఊరట నిచ్చేలా.. సకాలంలో వర్షాలు కురిసేలా వరుణయాగాలు నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ ఆ శాఖ వర్గాలను ఆదేశించారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కోవడానికి దైవబలం తోడు కావాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు.

**అన్ని ప్రధాన ఆలయాల్లో..**

రాష్ట్రంలో ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజరాజేశ్వరి స్వామి ఆలయం, భద్రాచలంలోని రాముని ఆలయంతో పాటు అన్ని జిల్లాల్లో పురాతన దేవాలయాల్లో యాగాలతో పాటు హోమాలు నిర్వహించాలని దేవాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అందుకు సంబంధించి పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. కానీ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ పంప్ సెట్ల వాడకం పెరిగింది. గృహ విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం అదనపు విద్యుత్ కొనుగోలు చేస్తోంది.

# ఏపీ సెటిలర్స్‌కు పెద్ద చిక్కు!

జరుగుతున్న సంగతి తెలిసిందే. ఒక వ్యక్తికి ఒకచోట మాత్రమే ఓటు ఉండేలా ఈ సర్వే ప్రక్రియ నడుస్తోంది. ఈ తరుణంలో రెండు చోట్ల ఓటు ఉన్నవారు ఒకచోట మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది. దీంతో హైదరాబాదులో సెటిలర్స్ గా ఉన్న ఏపీ ప్రజలు ఒక చోట ఓటు ఉంచుకోవడంపై దృష్టి పెట్టారు. హైదరాబాద్ కంటే ఏపీ వైపే వారు మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే ఏపీలో ఓటు కోల్పోయిన మరుక్షణం.. వారు సంక్షేమ పథకాలను కోల్పోవాల్సి ఉంటుంది. అందుకే తమ చాయిస్ ఏపీ అంటూ వారు ముందుకు రావడం విశేషం.

**హైదరాబాదులో సెటిలర్స్ అధికం..**

భాగ్యనగరంలోని కూకట్పల్లి, కెపిహెచ్బి, ప్రగతి నగర్, నిజాంపేట, మియాపూర్, బీహెచ్ఈఎల్, బాచుపల్లి, అశోక్ నగర్, ఎస్సార్ నగర్, అమీర్పేట్, మాదాపూర్, శేరిలింగంపల్లి, మేడ్చల్, దిల్సుఖ్నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో ఏపీ సెటిలర్స్ ఎక్కువగా ఉంటారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఏ ఇద్దరు కలిసినా.. ఏంటి బాసు.. ఓటు అక్కడ.. ఇక్కడ అంటూ చర్చించుకుంటున్నారు. ఈనెల 22 వరకు సర్ కు గడువు ఉండగా.. ఏపీలోని వారి గ్రామాల నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు.. వారికి ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు.

**ఇప్పటివరకు వారిదే హవా..**

హైదరాబాదులో సెటిలర్స్ గా ఉన్నవారు ఎటు తేల్చుకోలేకపోతున్నారు. ఇక్కడ ఉంటూ సంక్రాంతి, దసరా పండగలకు సంతూర్ వెళ్లి వచ్చేవాళ్లు.. తెలంగాణలోని ఓటు ఉంచుకోవాలని భావిస్తున్నారు. ఓటు లేకపోతే ఎవరూ పట్టించుకోరు అని భావించిన వారు ఉన్నారు. మరోవైపు ఏపీలోని స్వగ్రామం లో ఓటు లేకపోతే సంక్షేమ పథకాలతో పాటు అక్కడితో సంబంధాలు తెగిపోతాయని బాధపడిన వారు ఉన్నారు. అయితే ఏ ఒక్కరితో ఈ పరిస్థితి కాదు. హైదరాబాదులో సెటిలర్స్ గా ఉన్న వారంతా ఇప్పుడు ఇదే బాధపడుతున్నారు.

**ముగుస్తున్న సర్ ప్రక్రియ..**

ఈనెల 22 తో ఏపీలో సర్ ప్రక్రియ ముగియనుంది. దీంతో ఎన్రోల్మెంట్ ప్రక్రియ ముగుస్తుండడంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం వారికి అనివార్యంగా మారింది. ఇప్పటివరకు రెండు చోట్ల వారికి ఓట్లు ఉండేవి. రెండు చోట్ల ప్రాధాన్యం దక్కేది. ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇకపై ఆ పప్పులు కూడా ఉడకవు. రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు తేలితే ఏడాది జైలు ఖాయమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే ఈ పరిస్థితులను గమనిస్తున్న సెటిలర్స్.. తమ ఓటును ఏపీలోని స్వగ్రామంలోనే ఉంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# తుంగభద్ర పరివాహక రాష్ట్రాలతో భేటీ



సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం కేంద్రం ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తొలిసారిగా ఈనెల 27న ఢిల్లీలో కేంద్ర జలసంఘం కార్యాలయంలో సమావేశం కానుంది. సీడబ్ల్యూసీ సభ్యుడుయోగేష్ పైథంకర్ అధ్యక్షతన ఏపీ ఈఎన్సీ కె.నరసింహమూర్తి, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి బీఎస్ శివశంకర్, తెలంగాణ ఈఎన్సీ ఓపీ రమేష్ బాబు, సీడబ్ల్యూసీ సీఈలు అభిషేక్ బెనర్జీ, సంజయ్ గంగ్వార్, శరబ్‌జీత్‌సింగ్ భక్షీ, ఓంప్రకాష్ గుప్తా సభ్యులుగా ఉన్న ఈ కమిటీకి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆస్మా ఖాతూన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. గత నెల 25న తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ హాజరై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఆ మేరకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈనెల 11న కేంద్ర జల్ శక్తి శాఖ జాయింట్ కమిషనర్ సంజయ్‌కుమార్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు అంశాలపై అధ్యయనం చేసి ఆర్నెల్లలోగా నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని నిర్దేశిరచారు. తుంగభద్ర హైపవర్ కమిటీ అధ్యయనం చేసే అంశాలివీ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) కింద చారిత్రక వినివియోగం, నీటి అవసరాలు, నిర్వహణలో ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం చేస్తారు. తుంగభద్ర డ్యాంలో ఏ మేరకు పూడిక చేరింది..? దాని వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎంత తవిగ్గింది..? సాగు, తాగునీటి అవసరాలు, జలవిద్యుదుత్పత్తిపై ఏ మేరకు ప్రభావం పడుతోంది..? డ్యామ్ భద్రత, వరద నియంత్రణ చర్యలపై సూచనలు చేస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక తీతకు సంబంధించి సాంకేతిక, ఆర్థిక అంశాలను పరిశీలించి లాభదాయక మార్గాలను సూచించడం. ఇకపై రిజర్వాయర్‌లో పూడిక చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు.?ఆర్డీఎస్‌కు నీటి లభ్యవిత భరోసా కల్పింవిచేందుకు తుంగభద్ర డ్యావిమ్ దిగువన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సిన అవసరంతోపాటు ట్రిబ్యునల్ అవార్డులు, ఒప్పందాలు, న్యాయపరమైన ఆమోదంపై అధ్యయనం వంటివి పరిశీలిస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వల్ల ప్రయోజనం ఉంటుందా? సమాంతరంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించడం వల్ల మేలు జరుగుతుందా? లాంటి అంశాలపై సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల పరిశీలన. అంతర్రాష్ట్ర అంశాలు, సామాజిక, పర్యావరణ, న్యాయపరమైన చిక్కులపై అధ్యయనం. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పులకు లోబడి రాష్ట్రాలకు వాటా మేరకు నీరు అందే అవకాశంపై పరిశీలన. అవసరమైతే సబ్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక ఆహ్వానితులను నియమించుకునేందుకు హైపర్ కమిటీకి అధికారాలు అప్పగించారు.

# రవాణాశాఖ నిబంధలను కఠినతరం



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించడంతో అధికారులు తగు చర్యలకు దిగుతున్నారు. ముఖ్యంగా స్కూల్ బస్సులతో పాటు, అధికా లోడ్‌తో వెళ్లే వాహనాలపై దృష్టి సారించారు. రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓవర్‌లోడింగ్ వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే వెంటనే సీజ్ చేయాలని రవాణా అధికారులు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గతంలో చెక్‌పోస్టులను రద్దు చేసిన సమయంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటూ తనిఖీల వేగాన్ని పెంచనున్నారు. జూన్ 8 నుంచి ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా రంగంలోకి దించిన మొబైల్ స్క్వాడ్‌ల పనితీరును ఇటీవలే మంత్రి పొన్నం సమీక్షించారు. త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్న వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని.. స్లీపర్ బస్సుల్లో జరిగే నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించకుండా, గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

హామీ ఇచ్చాకే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో..బహదూర్‌గూడ భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని అనుకున్నాం. కానీ మీరు బ్లాక్ మెయిలర్‌లు ప్రజలను భయపెట్టడానికి వచ్చిన హైడ్రా అంటూ విరుచుకుపడ్డారు. బహదూర్‌గూడా భూములపై స్టాటస్‌కో ఉంది కాబట్టి జిల్లా కలెక్టర్ కోర్టు అనుమతి లేకుండా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రజాక్షేత్రంలో నిలబెడతామని అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో చేపట్టిన రైతు నిరసన ఐదో రోజుకు చేరింది. రైతులకు ఈరోజు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ ఇంచార్జ్ పట్ల కార్తీక్ రెడ్డి నిలబడ్డారు. బహదూర్ గూడ లోని వ్యవసాయ పొలాలని తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న ప్రజలకు బులెట్ ట్రైన్ పేరుతో లాక్కోవాలని చూస్తుంది. కానీ ముమ్మాటికి రైతుల పక్షాన ఉండి పోరాడుతాం, ఎక్కడికైనా వెళతాం కానీ రైతుల భూములను లాక్కునే ప్రసక్తి లేదంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. భూముల రైతులను పిలిచి బెదిరించి భూములను తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. కానీ బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రానున్న 2 సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం రాబోతుంది కాబట్టి బహదూర్ గూడా రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందొద్దని అందరికీ కెసిఆర్ చేతుల మీదుగా పట్టా, పాసు పుస్తకాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన




వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35-చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.




# దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

# పాకిస్తాన్‌కు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

బాలుచ్ నాయకుడు మీర్ యార్ బలోచ్ .. పాకిస్తాన్ నుంచి నేరుగా బలుచిస్తాన్ ను ఒక స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. జాతీయగీతం గా మచుకీన్ బలోచాని.. కరెన్సీగా ఫాలూస్ ను ఖరారు చేశారు. దేశంలో 85 శాతానికి పైగా భూభాగం పై తమ సైన్యం నియంత్రణ ఉందని ప్రకటించారు.

**అణచివేతను సహించలేక..**

పాకిస్తాన్ కు అంతర్జాతీయ స్థాయిలో ఇది ఒక షాకింగ్ పరిణామం. పాకిస్తాన్ నిలువ దోపిడీని సహించలేక బలుచిస్తాన్ ఉద్యమకారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏళ్ల తరబడి తమపై సాగిస్తున్న పోరాటానికి సరైన నిర్వచనం ఇస్తూ.. తమ దేశాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. భౌగోళికంగా బలుచిస్తాన్ పాకిస్తాన్లో అతిపెద్ద రాష్ట్రం గా ఉంది. అరేబియా సముద్ర తీరాన ఉన్న ఈ రాష్ట్రం.. ఆసియాలోనే కీలక స్థావరం. అటువంటి రాష్ట్రం ఇప్పుడు కొత్త దేశంగా అవతరించింది. అక్కడ అపారమైన బంగారం, రాగి గనులు, 1200 బొగ్గు గనులు, 150కి పైగా గ్యాస్ క్షేత్రాలపై బలుచిస్తాన్ నియంత్రణ కొనసాగుతుందని ఉద్యమకారులు ప్రకటన చేశారు.

**ఒక సంపన్న ప్రాంతం..**

బలుచిస్తాన్ ఒక సంపన్న భూమి. అయితే అక్కడ సంపదను వినియోగించుకుంటూ వచ్చింది పాకిస్తాన్ ప్రభుత్వం. కానీ అక్కడి పేద ప్రజలు మాత్రం అలానే ఉండిపోయారు. వారిని పట్టించుకునే ప్రయత్నం చేయలేదు ప్రభుత్వం. అందుకే అక్కడ ఉద్యమకారులు ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ రాష్ట్రాన్ని ఒక దేశంగా ప్రకటించుకున్నారు. తమను తామే పాలించుకుంటామని తేల్చి చెప్పారు. బలుచిస్తాన్ ను స్వతంత్ర దేశంగా గుర్తించాలని అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం తమ వనరులను దోచుకోవడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు.

**బలవంతంగా విలీనం..**

1947లో భారత్ దేశ విభజన నాటికి.. బలుచిస్తాన్ ఒక స్వతంత్ర రాజ్యంగా ఉండేది. 1948లో పాకిస్తాన్ దానిని బలవంతంగా కలిపేసుకుంది. భారీ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఆ దేశానికి లేకపోవచ్చు. కానీ ఐదు లక్షల మందితో కూడిన సైన్యం, నావికాదళం, వాయు బలగాలు మాత్రం బలుచిస్తాన్ సొంతం. కేవలం తమను తాము దేశంగా ప్రకటించుకోవడమే కాదు.. తమ జాతీయ గీతాన్ని రూపొందించుకున్నారు. తమ దేశ కరెన్సీని కూడా ప్రకటించారు. బలుచిస్తాన్ ప్రకటనతో పాకిస్తాన్ తో పాటు చైనాలో కూడా ప్రకంపనలు రేపుతోంది.. చైనా వ్యవహార శైలిని బలిచిస్తాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పాకిస్తాన్లో చైనా పెట్టుబడులను బలుచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా తమ రాష్ట్రాన్ని ఒక దేశంగా ప్రకటించుకుంది.

# అనుమతులు ఉన్నా అడ్డుకోవడం నిరంకుశ పాలన

**కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**

గండిపేట(క్రైమ్ మిర్రర్): హైకోర్టు అనుమతులు ఉన్నా సదస్సుకు హాజరుకాకుండా అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆదేశాల మేరకు సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సుకు కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు అనుమతి ఇచ్చినప్పటికి యువ సంగ్రామ సదస్సును అడ్డుకునేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్రలు చేసిందన్నారు. యువ సంగ్రామ సదస్సుకు హాజరుకాకుండా అడుగడుగునా పోలీసులతో అడ్డంకులు సష్టించిన అదరక, బెదరక ప్రజాస్వామ్య పద్ధతిలో నిరుద్యోగ సమస్యలు, యువత హక్కుల సాధనకై సమస్సుకు హాజరుకావడం జరిగిందన్నారు. కోర్టు అనుమతితో సభ నిర్వహిస్తుంటే అడ్డుకోవడం ఏంటి నిరుద్యోగుల పట్ల వివక్ష చూపడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తరలివెళ్లిన వారిలో నాయకులు కాటేదాన్ కార్మిక విభాగం అధ్యక్షులు ఉప్పల్ శ్రీను, వెంకటరమణ, అశోక్‌కుమార్, సునీల్, అనిల్, రాజకుమార్, యాదగిరి భాస్కర్, బొడ్రాయి శివ,



సరికొండ దుర్గేష్, యాదయ్య, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షులు జహీర్‌ఖాన్, మోహమ్మద్ నహీముద్దీన్, శివ పైల్వాన్, రాజు, కార్తీక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో ఉద్రిక్తత: బీజేపీ నేత తోకల శ్రీనివాస్ రెడ్డి గృహనిర్బంధం, అరెస్ట్

**బహదూర్ గుడాలో బుల్లెట్ ట్రైన్ టర్మినల్ భూసేకరణపై రైతుల నిరసన**

**బాధితులకు మద్దతుగా వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు**

**లాఠీఛార్జ్, ఘర్షణ వాతావరణం.. పలువురు కార్యకర్తలకు గాయాలు**

**కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు.. అక్రమ అరెస్టులపై బీజేపీ ఆగ్రహం**

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్ మండలం బహదూర్ గుడా గ్రామంలో బుల్లెట్ ట్రైన్ టర్మినల్ భూసేకరణ ఉద్రిక్తతకు దారితీసింది. టర్మినల్ పేరుతో రైతుల భూములను సేకరించడాన్ని నిరసిస్తూ గత కొన్ని రోజులుగా స్థానిక రైతులు ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బాధితులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు (కంటెస్టెడ్ ఎమ్మెల్యే) తోకల శ్రీనివాస్ రెడ్డిని పోలీసులు శనివారం ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో గృహనిర్బంధం చేశారు. ?పోలీసుల ఆంక్షలను ధిక్కరించి ఆయన ముందుకు సాగడానికి ప్రయత్నించడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగి, ఉద్రిక్తత



చోటుచేసుకోవడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ లాఠీఛార్జ్‌లో పలువురు పార్టీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రైతులకు మద్దతు తెలిపేందుకు శాంతియుతంగా వెళ్తున్న నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తోకల శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు కోసం శంషాబాద్ రైతులు తమ భూములను త్యాగం చేశారు. ఇప్పుడు మళ్లీ ప్రజా అవసరాల పేరిట దశాబ్దాలుగా భూమినే నమ్ముకుని జీవిస్తున్న పేద రైతులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం? రికార్డులలో సర్వే నెంబర్లను మాయం చేస్తూ, ఉన్న నెంబర్ల విస్తీర్ణాన్ని ఇష్టారాజ్యంగా పెంచుతూ పేదలను నడిరోడ్డుపై పడేస్తున్నారు. రైతు కడుపు కొట్టి ఏ ఒక్కరూ బాగుపడినట్లు చరిత్రలో లేదు అని అధికారుల తీరుపై మండిపడ్డారు. ?ముఖ్యంగా ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు సివిల్ డ్రెస్సుల్లో వచ్చి కార్యకర్తలపై విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రైతుల పక్షాన నిలబడినందుకు అక్రమంగా నిర్బంధించారని, రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం ఆగేదే లేదని తోకల శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తోకల శ్రీనివాస్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ డివిజన్ ప్రెసిడెంట్ గోదా పాండు, సీనియర్ నాయకులు యాదవ్ అడికే, జనార్ధన్ రావుల, భాస్కర్, సంతు గౌడ్, బుచ్చిరెడ్డి, తలారి చిన్న, మన్మోహన్ రెడ్డి, ఎల్వి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్ రెడ్డి, నవర మురళీధర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శంకర్ రెడ్డి, కూపర్ రామారావు, శేఖర్ తదితరులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయం జరిగే వరకు భూసేకరణను అడ్డుకుని తీరుతామని బీజేపీ స్పష్టం చేశారు.



# దర్యాప్తులో నైపుణ్యమే విజయానికి మూలం

**కరీంనగర్ జ్యూవెలరీ దోపిడి కేసు దర్యాప్తుపై ప్రొబేషనరీ డీఎస్పీలకు కేస్ స్టడీ ప్రెజెంటేషన్**

గండిపేట(క్రైమ్ మిర్రర్): దర్యాప్తు అనేది కేవలం నిందితులను అరెస్టు చేయడమే కాకుండా, శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, అంతరాష్ట్ర సమన్వయం, సమర్ధవంతమైన నాయకత్వం కలయిక అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డీఎస్పీలకు, కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యూవెలర్స్‌లో ఈ ఏడాది మే నెలలో జరిగిన భారీ బంగారు నగల దోపిడి కేసు దర్యాప్తు అంశంపై ప్రత్యేక కేస్ స్టడీ ప్రెజెంటేషన్ నిర్వహించారు. రాష్ట్రంలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాపర్టీ నేరాల్లో ఒకటైన ఈ కేసులో కరీంనగర్ పోలీసులు అనుసరించిన శాస్త్రీయ దర్యాప్తు విధానాన్ని భవిష్యత్ పోలీసు అధికారులకు అధ్యాయనంగా పరిచయం చేయాలన్న ఉన్నతాధికారులు, అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆకాంక్ష మేరకు ఈ ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ప్రారంభంలో కమిషనర్ గౌస్ ఆలం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నేరస్తలం పరిశీలన నుంచి నిందితుల అరెస్టు వరకు అనుసరించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, సాంకేతిక ఆధారాల సేకరణ, ఇంటెలిజెన్స్ వినియోగం, డిజిటల్ విశ్లేషణ, బృందాల సమన్వయం వంటి అంశాలను సమగ్రంగా వివరించారు. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రతి బృందానికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించడం, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల పోలీసులతో సమన్వయం సాధిస్తూ నిందితులను గుర్తించి అరెస్టు చేసిన విధానాన్ని వివరించారు. అంతరాష్ట్ర పోలీసు సమన్వయం విజయవంతమైన దర్యాప్తుకు ఎంత కీలకమో ఆయన ఉదాహరణలతో వివరించారు. అనంతరం కేసు దర్యాప్తులో ప్రత్యేకంగా పాల్గొన్న కరీంనగర్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తమ అనుభవాలను ట్రై నీ అధికారులతో పంచుకున్నారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఈ సెషన్‌లో పాల్గొని భవిష్యత్ పోలీసు అధికారులకు ఇటువంటి వాస్తవ కేసుల అధ్యయనం అత్యంత ఉపయోగకరమని పేర్కొన్నారు. చట్టపరమైన పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు, బృంద సమన్వయం, నాయకత్వ లక్షణాలు ప్రతి దర్యాప్తు అధికారికి అత్యవసరమని సూచించారు. కార్యక్రమం ముగింపులో కోర్సు కోఆర్డినేటర్ వేమా శ్రీనివాస్‌రెడ్డి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలీంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ అకాడమీ తరపున జ్ఞాపికను అందజేశారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ సతీష్‌కుమార్ లైజన్ అధికారిగా వ్యవహరించారు.

# స్కూల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ- ఎంఈఓ వెంకటేశం

**మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాధికారి వెంకటేశం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసంపై నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు (టెక్స్ట్‌బుక్స్), వర్క్‌బుక్స్, అలాగే బ్రేక్‌ఫాస్ట్ మరియు మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు పిల్లలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను నేరుగా పిల్లలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధన ఎలా చేస్తున్నారు, పిల్లలు చదువులో ఎలా రాణిస్తున్నారు అనే అంశాలపై తల్లిదండ్రులు ప్రతిరోజూ ఇంటి వద్ద పిల్లలతో చర్చించాలని ఆయన పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల తమ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని ఎంఈఓ భరోసా ఇచ్చారు. విద్యార్థులకు చదువులో ఎలాంటి సందేహాలు ఉన్నా, వాటిని నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించిన ఈ సమావేశాల్లో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్క తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి పిల్లల ప్రగతిని వివరించారు. పిల్లల చదువుల మెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇరువర్గాలు సుదీర్ఘంగా చర్చించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గండిపేట(క్రైమ్ మిర్రర్): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిని వివరాల ప్రకారం నార్సింగి గ్రామం ఓఆర్ఆర్ టోల్ గేట్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 40--45 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్నారు. మృతి చెంది మూడు రోజులు అయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధితులు ఎవరైనా ఉంటే ఫోన్ నెంబర్ 8712567354, 8712663119లలో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వివేకానంద ఆశయాలను సమాజంలో మరింత విస్తరింప చేయాలి




**చీఫ్ గెస్ట్ గా దివాకర టి.ఎస్ (ఐ.ఎ.ఎస్)**

క్రైమ్ మిర్రర్ ఖమ్మం : ఖమ్మం వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ (విఐ హెచ్‌ఈ) ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఆశయాలను సమాజంలో మరింత విస్తరింపజేసే దిశగా మరో చిరస్మరణీయ మైలురాయిగా నిలవనున్న వి ఐ హెచ్‌ఈ--యస్‌ఆర్కె వి క్యాంపస్ ప్రారంభోత్సవానికి మీ సాన్నిధ్యంతో కార్యక్రమానికి శోభను చేకూర్చి, ప్రోత్సాహం మరియు భాగస్వామ్యంతో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా సవినయంగా కోరుతున్నాను .ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల అది సాధ్యపడలేదు. అందువల్ల ఈ సందేశాన్నే వ్యక్తిగత ప్రత్యేక ఆహ్వానంగా భావించి, మీ అమూల్యమైన సమయాన్ని కేటాయించి తప్పక విచ్చేయవలసిదిగా మనవి

## నార్సింగిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గండిపేట(క్రైమ్ మిర్రర్): రహదారిపై స్పృహ తప్పి పడిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తిని మృతి చెందరు. ఈ మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11వ తేదీ ఉదయం 11:30 గంటల ప్రాంతంలో నార్సింగి ఫ్రైడే మార్కెట్ రోడ్డుపై ఒక గుర్తుతెలియని పురుషుడు(35-40) స్పృహ తప్పి పడిపోయి ఉన్నట్లు స్థానిక పౌరుడు డయల్-100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, అపస్మారక స్థితిలో ఉన్న సదరు వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియా ఆసుపత్రిలో వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో సదరు వ్యక్తి జులై 15న చికిత్స పొందుతూ కన్నుమూశారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఏవీ లభించకపోవడంతో అతని బంధువులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే లేదా అతని కుటుంబ సభ్యులకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే నార్సింగి పోలీసులను నార్సింగి పోలీస్ స్టేషన్ 9490617448, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ 8555939100 సంప్రదించాలని కోరారు.

**మానవ జీవన ప్రస్థానం ఒక నిరంతర అంతర్బాహ్య సమరక్షేత్రం. బాహ్య ప్రపంచంతో సాగించే జీవనపోరాటం ఒక ఎత్తయితే, అంతరంగంలోని మానసిక సంఘర్షణలతో తలపడటం మరో ఎత్తు. ఆధునిక కాలపు వేగవంతమైన జీవనశైలిలో ఆర్థిక ఒడిదొడుకులు, వృత్తిపరమైన అభద్రతాభావం, కుటుంబ వ్యవస్థల్లో చోటుచేసుకుంటున్న విచ్ఛిన్నాలు, మానసిక ఒంటరితనం వంటి తీవ్ర సంక్షోభాలు నేటి మనిషి అంతరంగాన్ని తీవ్రంగా అల్లకల్లోలం చేస్తున్నాయి.**

సంసార బంధాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇక ఆ సరోవరం మనం నిత్యం ఈదుతున్న సంసార సాగరానికి ప్రతిబింబం. మనిషి తాను ఎంతటి మేధావినని భ్రమించినా, ఎంతటి అపార సంపదను, అధికారాన్ని కలిగి ఉన్నప్పటికీ, కాలచక్ర గమనంలో ఏదో ఒక అనివార్య సందర్భంలో ఏదో ఒక అపరిచిత సంక్షోభం అతడి పాదాన్ని గట్టిగా పట్టి పీడిస్తుంది. అది అకస్మాత్తుగా సంభవించే అనారోగ్యం కావచ్చు, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కావచ్చు లేదా మానసిక వేదన కావచ్చు. అప్పుడు మనిషి తన మేధస్సును, బాహుబలాన్ని, సామాజిక శక్తులన్నింటినీ ఉపయోగించి ఆ క్లిష్ట పరిస్థితి నుండి బయటపడటానికి తీవ్రంగా శ్రమిస్తాడు. కానీ, భౌతిక శక్తులతో సాగించే ఆ పోరాటం కొన్నిసార్లు మానసిక శక్తిని మరింత క్షీణింపజేస్తుందే తప్ప, శాశ్వత ఉపశమనాన్ని లేదా విముక్తిని ప్రసాదించలేదు.

నేటి ఆధునిక మానసిక ఆరోగ్య నిపుణులు, సామాజిక మానసిక సంప్రదింపులను ఆశ్రయించడం అనేది ఓటమికి నిదర్శనం కాదు; అదొక అత్యంత ధైర్యసాహసాలతో కూడిన ప్రగతిశీల అడుగు. గజేంద్ర మోక్షం అంతిమంగా ప్రబోధించే అత్యున్నత తాత్విక సూత్రం శరణాగతి తత్వం. మానవుడు తన సంకుచిత అహంభావాన్ని సంపూర్ణంగా విడనాడి, ఈ అనంత విశ్వంలో తనకంటే అత్యంత శక్తివంతమైన ఒక సత్యం లేదా వ్యవస్థ ఉందని హృదయపూర్వకంగా అంగీకరించినప్పుడే అతడికి అసలైన అంతర్గత మనశ్శాంతి లభిస్తుంది. దీనిని కేవలం ఒక మతపరమైన లేదా ఆధ్యాత్మిక విశ్వాసంగానే చూడనవసరం లేదు,ఆధునిక మానసిక ఆరోగ్య దృక్పథంలో కూడా ఇది ఎంతో వైజ్ఞానికమైనది. తనకంటే ఉన్నతమైన ఒక సార్వత్రిక శక్తిపై నమ్మకం ఉంచడం అది దైవభావన కావచ్చు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కావచ్చు, నమ్మకమైన స్నేహ బంధాలు కావచ్చు లేదా జీవితం పట్ల సానుకూల దృక్పథం (పాజిటివిటీ) కావచ్చు అది మనిషిని

# జీవన సరోవరంలో మొసలి పట్టు

# అహాన్ని వీడటమే అసలైన విముక్తి!

ఇలాంటి క్లిష్ట సమయాల్లో మానవాళి దేనికోసం ఆర్రులు చాస్తుంది? ఏ అభయహస్తాన్ని ఆశ్రయిస్తుంది? ఈ జటిలమైన ప్రశ్నలకు వేల సంవత్సరాల క్రితమే వ్యాసప్రోక్త భాగవత మహాపురాణంలోని గజేంద్ర మోక్షం ఘట్టం అత్యంత తాత్వికమైన సమాధానాన్ని ఆవిష్కరించింది. పురాణ ప్రాశస్త్యం ప్రకారం, త్రికూట పర్వత సానువుల్లోని రమణీయమైన ఋతుమంత సరోవరంలో గజేంద్రుడనే గజరాజు తన అశేష పరివారంతో కలిసి జలక్రీడలాడుతూ ఉంటాడు. అపారమైన శారీరక బలం, మదగర్వం, తిరుగులేని అధికారం అన్నీ కలగలిసిన ఆ గజరాజు జీవితం, అకస్మాత్తుగా ఒక జలచరం (మొసలి) ఆ ఏనుగు పాదాన్ని పట్టుకోవడంతో ఊహించని మలుపు తిరుగుతుంది. ఆ మొసలి పట్టు ఎంతటి వజ్రసంకల్పంతో కూడినదంటే, గజేంద్రుడు తన సర్వశక్తులనూ ఒడ్డి, శతాబ్దాల పాటు పోరాడినా ఆ బంధనం నుండి విముక్తి లభించదు. సంవత్సరాల తరబడి సాగిన ఆ సుదీర్ఘ పోరాటంలో గజేంద్రుడి శారీరక దారఢ్యం క్రమేపీ క్షీణించిపోతుంది. ఒకప్పుడు తన చుట్టూ ఉన్న తోటి ఏనుగులు, ఆత్మీయులు, బంధుమిత్రులు అందరూ నిస్సహాయ స్థితిలో అతడిని ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతారు. సర్వ మార్గాలూ మూసుకుపోయి, నిరాశానిస్పృహలు ఆవరించిన ఆ కడపటి క్షణంలో, గజేంద్రుడు తనలో మిగిలివున్న ఆఖరి శ్వాసతో, శేష బలంతో ఆ జగన్నాథుడైన పరమాత్మున్ణి హృదయపూర్వకంగా ఆశ్రయిస్తాడు. ఆ ఆక్రందనే భాగవతంలో అత్యంత భక్తిభావభరితమైన “ఆర్తత్రాణపరాయణ” శ్రీమహావిష్ణు స్తుతిగా ప్రసిద్ధి చెందింది. భక్తసులభుడైన ఆ శ్రీహరి తన భక్తుడి మొర ఆలకించి, క్షణమాత్రమైనా ఆలస్యం చేయకుండా గరుడవాహనారూఢుడై విచ్చేసి, తన సుదర్శన చక్రంతో ఆ జలచరాన్ని సంహరించి గజేంద్రునికి శాశ్వత ముక్తిని ప్రసాదిస్తాడు. ఈ పౌరాణిక గాథను కేవలం ఒక చారిత్రక లేదా కావ్య రూపంగా చూస్తే సరిపోదు. ఇది సమకాలీన మానవ మనస్తత్వానికి, సామాజిక జీవన విరాట్ స్వరూపానికి అద్దం పట్టే ఒక అద్భుతమైన జీవన రూపకం. ఇక్కడ గజేంద్రుడు మన మిథ్యా అహంకారానికి, భౌతిక శారీరక బలానికి, సమాజంలో మనం సంపాదించుకున్న హోదాకు, అధికారానికి ప్రత్యక్ష సంకేతం. ఆ గజరాజు పాదాన్ని బంధించిన మొసలి మన అదుపులేని కోరికలకు, ఇంద్రియ వ్యామోహాలకు,



శాస్త్రవేత్తలు వ్యక్తపరుస్తున్న అభిప్రాయాల ప్రకారం, మనిషి తనకు ఎదురయ్యే ప్రతి సంక్షోభాన్ని కేవలం తన స్వయంకృషితో, అహంకారంతోనే అధిగమించాలని మొండిగా పట్టుబట్టినప్పుడు, అతడిలో ఒత్తిడి, తీవ్ర ఆందోళన (యాంగ్జైటీ) పరిధులు దాటిపోతాయి. విశ్వంలో జరిగే ప్రతి అంశాన్ని తనే స్వయంగా నియంత్రించగలననే భ్రమలో బతికేంతవరకు మానవ మనస్సు అలసటకు లోనవుతూనే ఉంటుంది. ఈ విషయంలో గజేంద్రుడి వృత్తాంతం మనకు బోధించే ప్రథమ పాఠం ఏమిటంటే మన లౌకిక బలం ఎంతటి అజేయమైనదైనా, దానికి ఒక నిర్దిష్టమైన పరిమితి ఉంటుంది. ఆ హద్దును సమయానుకూలంగా గుర్తించడమే నిజమైన వివేకం. ఇక ఇందులో దాగివున్న ద్వితీయ పాఠం క్లిష్ట సమయాల్లో ఇతరుల సహాయం అర్థించడం ఎన్నటికీ బలహీనత కాజాలదు. గజేంద్రుడు తన శారీరక బలమంతా పూర్తిగా హరించుకుపోయినప్పటికీ, నిరాశతో మౌనంగా ఉండిపోలేదు. తనలోని చివరి శక్తిని కూడగట్టుకుని విశ్వశక్తిని ఆహ్వానించాడు. సమకాలీన సామాజిక జీవనంలో కూడా సంక్షోభ సమయాల్లో మనుషులు తమ అహంకారాన్ని పక్కనబెట్టి మనసు విప్పి మాట్లాడటం, ఆత్మీయులతో బాధలను పంచుకోవడం, అవసరమైతే వృత్తి నిపుణుల

నిరాశామయమైన ఒంటరితనం నుండి, డిప్రెషన్ నుండి సురక్షితంగా బయటకు తీసుకువస్తుంది. ప్రస్తుత సమాజంలో మనం నిత్యం చూస్తున్న యువత మానసిక సంక్షోభాలు, ఆందోళనకరంగా పెరుగుతున్న ఆత్మహత్యల శాతాలు, విపరీతమైన పని ఒత్తిడితో కుంగిపోతున్న ఐటీ మరియు ఇతర రంగాల ఉద్యోగులు వీరందరికీ భాగవతంలోని గజేంద్ర మోక్షం కథ ఒక అద్భుతమైన జీవన దిక్సూచిగా ఉపయోగపడుతుంది. ఆ కథలోని గజేంద్రుడి పూర్వరంగ జీవితంలాగే, మనం కూడా ఎల్లప్పుడూ కేవలం బాహ్య పోరాటమే ఏకైక మార్గం అని భావించకూడదు. కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో మన అంతర్గత బలహీనతలను నిజాయితీగా అంగీకరించడం, నైతిక సహాయం కోసం అభ్యర్థించడం, సర్వోన్నత విశ్వశక్తిపై లేదా ప్రకృతిపై అచంచలమైన విశ్వాసం ఉంచడమే నిజమైన మానసిక విముక్తికి రాజమార్గం అవుతుంది. జీవన ప్రయాణంలో సంక్షోభాలు అనేవి పూర్తిగా అనివార్యమైన మైలురాళ్ళు. అయితే ఆ సంక్షోభ సమయాల్లో మనం ఎంతటి విజ్ఞతతో, వినమ్రతతో స్పందిస్తామనే అంశమే మన ఆత్మవిశ్వాసాన్ని, శాశ్వత మనశ్శాంతిని నిర్ణయిస్తుంది. ఆనాటి సరోవరంలో వినిపించిన గజేంద్రుడి ఆర్తనాదం కేవలం ఒక ఏనుగు చేసిన కేక కాదు,అది శతాబ్దాల కాలంగా భౌతిక బంధాలలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్న సమస్త మానవాళి యొక్క సార్వకాలిక అంతరంగ ఆక్రందన. ప్రతి మనిషి జీవితంలోనూ ఏదో ఒక క్లిష్ట దశలో అలాంటి ఆర్తనాదం చేయాల్సిన, తన అహాన్ని వీడాల్సిన పరీక్షా సమయం ఎదురవుతుంది. ఆ విపత్కర క్షణంలో మనం ఈ విశాల విశ్వంలో ఒంటరిగా లేమని, మనకు అండగా ఒక ఉన్నతమైన శక్తి నిరంతరం తోడుంటుందని గ్రహించడమే గజేంద్ర మోక్షం ఆధునిక సమాజానికి అందించే పరమార్థం.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


# శ్రీశైలం జలాశయంలో నీటి నిలువలు తక్కువ

### ప్రస్తుతం కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద సాగునీటి విడుదలకు అవకాశం లేదు

### తాగునీటికే తొలి ప్రాధాన్యం

### రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** ప్రస్తుత వానాకాలంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎగువ ప్రాంతాల్లో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడం, శ్రీశైలం జలాశయానికి ఆశించిన స్థాయిలో వరద జలాలు చేరకపోవడం వల్ల నాగర్ కర్నూల్ జిల్లాలో సాగునీటి పరిస్థితి క్లిష్టంగా మారిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, అందువల్ల మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల సాగునీటి పథకం (ఎంజీకేఎల్ఐఎస్) పరిధిలోని ఆయకట్టుకు ప్రస్తుతం సాగునీటిని విడుదల చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. జిల్లా సాగునీటి శాఖ ప్రధాన ఇంజనీర్ సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...., కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 4.51 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని వినియోగించేలా ప్రణాళిక రూపొందించబడిందని తెలిపారు. ఈ పథకంలో రేగుమాన్‌గడ్డ, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మూడు ఎత్తిపోతల దశల ద్వారా నీటిని ఎత్తిపోసి ఆయకట్టుకు సాగునీరు గతంలో అందించే వారని



వివరించారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా శ్రీశైలం జలాశయానికి గణనీయమైన వరద ప్రవాహాలు రాకపోవడంతో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవని తెలిపారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో మొత్తం స్థూల నీటి నిల్వ 41.45 టీఎంసీలు ఉన్నప్పటికీ, అందులో 30 టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కావడంతో వాస్తవంగా వినియోగించదగిన జీవ జల నిల్వ కేవలం 11.45 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉందని ,ఇదిలా ఉండగా, మిషన్ భగీరథ ద్వారా జిల్లాతో మహబూబ్నగర్ జిల్లా పాటు సంబంధిత ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం ప్రతి సంవత్సరం 7.12 టీఎంసీల నీటిని కేటాయించడం జరుగుతుందని, ఇప్పటికే జూన్ 1 నుంచి జూలై 18 వరకు 1.363 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం వినియోగించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించడం ప్రభుత్వ బాధ్యత కాబట్టి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ఆ అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని ఎల్లూరు, గుడిపల్లిగట్టు, జొన్నలబొగుడ, సింగోటం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లలో ప్రస్తుతం కలిపి కేవలం 2.23 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సాగునీటి విడుదల చేస్తే భవిష్యత్తులో తాగునీటి అవసరాలు కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని,ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి కొత్తగా వరద జలాలు వచ్చే వరకు ఎంజీకేఎల్ఐఎస్ ఆయకట్టుకు సాగునీటి విడుదల సాధ్యం కాదని స్పష్టం చేసిన కలెక్టర్, భవిష్యత్తులో వర్షపాతం పెరిగి జలాశయంలో నీటి నిల్వలు మెరుగుపడితే పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వ నిర్ణయం మేరకు సాగునీటి విడుదలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతాంగం పరిస్థితిని అర్థం చేసుకుని అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, సాగునీటి శాఖల అధికారులు గ్రామాల వారీగా రైతులకు విస్తృత అవగాహన కల్పించి, పంటల మార్పిడి, నీటి పొదుపు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, నీటి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం జలాశయానికి వరద జలాలు చేరి నీటి నిల్వలు పెరిగిన వెంటనే పరిస్థితిని సమీక్షించి సాగునీటి విడుదలపై తదుపరి నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు ప్రజలు, రైతులు ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి,జిల్లా యంత్రాంగానికి సహకరించాలని, నీటిని పొదుపుగా వినియోగిస్తూ తాగునీటి సంరక్షణకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం సాయంత్రం పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 19-7-2026


# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూక్ష్మి శ్రీకాంత్ నేర సామ్రాజ్యం బట్టబయలు

## అంతర్‌రాష్ట్ర చోరీ ముఠా ఛేదన.. 6 మంది అరెస్ట్ -- ఇద్దరు పరారీలో

## 53 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు, వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్




**నల్గొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతూ, పోలీసులకు సవాల్‌గా మారిన మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు భూక్ష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు, రూపొందించిన అంతర్‌రాష్ట్ర చోరీ ముఠాను నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 53 లక్షల విలువైన 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి ఆభరణాలు, 1 కోటి 50 లక్షల నగదు, రెండు టీవీలు, రెండు సౌండ్ బార్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ వెల్లడించారు.

**యువకులను మభ్యపెట్టి నేరాల వైపు మళ్లించిన శ్రీకాంత్**

ఇటీవల అరెస్టైన భూక్ష్మి శ్రీకాంత్‌ను విచారించగా, అతని నేర కార్యకలాపాలకు సంబంధించిన అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని ఎస్పీ పవార్ తెలిపారు. శ్రీకాంత్ విజయవాడ, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నల్గొండ తదితర ప్రాంతాల్లో వైన్ షాపుల వద్ద పరిచయమైన యువకులను లక్ష్యంగా, చేసుకుని ముందుగా వారికి మద్యం తాగించడం, డబ్బులు ఖర్చు పెట్టడం, వ్యక్తిగత సమస్యలను తెలుసుకుని సహాయం చేస్తున్నట్లు నమ్మకం కల్పించి, తనకు దగ్గర చేసుకునేవాడని విచారణలో తేలిందన్నారు. తర్వాత "తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలంటే చోరీలే మార్గం" అంటూ ప్రలోభపెట్టి వారిని నేరాల వైపు మళ్లించేవాడని వెల్లడించారు. తాళాలు ఎలా పగులగొట్టాలి, ఏ ఇళ్లను లక్ష్యంగా ఎంచుకోవాలి, రాత్రివేళల్లో ఎలా చోరీ చేయాలి, పోలీసుల కదలికలను ఎలా గమనించాలి, సీసీటీవీ కెమెరాలను ఎలా తప్పించుకోవాలి, దొంగిలించిన బంగారం, వెండిని ఎక్కడ విక్రయించాలి వంటి, అంశాలపై కూడా శిక్షణ ఇచ్చినట్లు విచారణలో బయటపడిందన్నారు.

**మూడు ప్రత్యేక బృందాలతో ఆపరేషన్**

శ్రీకాంత్ ఇచ్చిన సమాచారం ఆధారంగా తెలంగాణలో 28, ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసులు కలిపి మొత్తం 40 చోరీ కేసులకు సంబంధించి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ పవార్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ సీఐ పిఎన్డి. ప్రసాద్, మిర్యాలగూడ టూ టౌన్ ఎస్ఐ ఆంజనేయులు, మాడ్గులపల్లి ఎస్ఐ సురేశ్ యాదవ్ ఆధ్వర్యంలో, మూడు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటయ్యాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర నిఘా, ఖచ్చితమైన సమాచార సేకరణతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు నిర్వహించి పిడుగురాళ్ల, అంజనీపురం, మండేపూడి ప్రాంతాల్లో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, విచారించగా పలు చోరీ కేసులు వెలుగులోకి వచ్చాయి.

**జైల్లో ఏర్పడిన పరిచయంతో నేరాలకు శ్రీకారం**

విచారణలో మొత్తం తొమ్మిది మంది సభ్యులతో ఈ ముఠా ఏర్పాటైనట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో తమ్మిశెట్టి నాగరాజు మినహా మిగిలిన వారికి గతంలో నేరచరిత్ర లేదని తెలిపారు. నాగరాజుపై ఆంధ్రప్రదేశ్‌లో 10కి పైగా కేసులు ఉండటంతో పాటు, ఒక దోపిడీ కేసులో ఏడు సంవత్సరాల జైలు శిక్ష కూడా పడింది. రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించే సమయంలోనే, భూక్ష్మి శ్రీకాంత్‌తో పరిచయం ఏర్పడి, అనంతరం అతనికి ఆశ్రయం కల్పిస్తూ నేరాలకు సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు.

**రెండు రాష్ట్రాల్లో 40 కేసుల్లో ప్రమేయం**

ఈ ముఠా సభ్యులు ప్రధానంగా తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రాత్రివేళల్లో చోరీలకు పాల్పడేవారని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని మిర్యాలగూడ, నల్గొండ, వాడపల్లి, తిప్పర్తి, మాడ్గులపల్లి, చండూర్, కనగల్, డిండి, నరసరావుపేట, పిడుగురాళ్ల, విజయవాడ, బాపట్ల తదితర పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 40 ఆస్తి నేరాలకు పాల్పడినట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు. దర్యాప్తులో భాగంగా 12 వేర్వేరు నేర సంఘటనల ప్రదేశాల్లో లభించిన వేలిముద్రలు నిందితుల వేలిముద్రలతో సరిపోలినట్లు నిర్ధారణ అయిందన్నారు. అలాగే పలు ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాల ఆధారంగా కూడా నిందితులను గుర్తించామని చెప్పారు.

**నేరస్థులు తప్పించుకోలేరు : ఎస్పీ**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ. నేరస్థుడు ఎంత తెలివిగా ముఠాను నిర్మించినా, ఎంత జాగ్రత్తగా నేరాలకు పాల్పడినా చట్టం నుంచి తప్పించుకోలేడన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు, ప్రజల సహకారంతో ప్రతి నేరస్థుడిని చట్టం ముందు నిలబెడతామన్నారు. యువత తప్పుడు ప్రలోభాలకు లోనై నేరాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ అంతర్‌రాష్ట్ర చోరీ ముఠాను సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, డి. చంద్రశేఖర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ ఇన్‌స్పెక్టర్ పిఎన్డి. ప్రసాద్, నిడమనూర్ ఎస్ఐ విజయకుమార్, సీసీఎస్ ఎస్ఐ యూ. సురేశ్‌తో పాటు కేసు ఛేదనలో పాల్గొన్న హెడ్ కానిస్టేబుళ్లు, విష్ణు వర్ధన్ గిరితో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రకటించారు.

# పైళ్ల మల్లారెడ్డి--సాధన దంపతుల ప్రోత్సాహమే నా విజయానికి పునాది: యాట సంధ్య

## వలిగొండ రైతుబిడ్డ నుంచి అమెరికా వేదిక వరకు తెలంగాణ గాత్రం



**వలిగొండ జులై 18 (క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలానికి చెందిన జానపద గాయని యాట సంధ్య ప్రస్తుతం అమెరికా వేదికలపై తెలంగాణ జానపద గీతాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. రైతు కుటుంబంలో జన్మించిన సంధ్య, చిన్ననాటి నుంచే జానపద గేయాలతో తన ప్రతిభను చాటుకుని, తెలంగాణ ఉద్యమంలో తన గాత్రంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో స్పందించిన సంధ్య, తన ఎదుగుదలలో పగిళ్ల మల్లారెడ్డి--సాధన దంపతుల ప్రోత్సాహం మరువలేనిదని పేర్కొన్నారు. "ఇంటర్ నుంచి వారు స్థాపించిన ప్రభుత్వ విద్యాసంస్థలో చదివాను. నా పాటలోని ప్రతిభను గుర్తించి నన్ను ప్రోత్సహించారు. నేడు నా గాత్రం ప్రపంచ వేదికలకు చేరడానికి వారు చూపిన నమ్మకం, అందించిన ప్రోత్సాహమే కారణం. వారి రుణం జీవితాంతం మరువలేను" అని తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో తెలంగాణ సంస్కృతి, భాష, జానపద కళలను ప్రపంచానికి పరిచయం చేస్తూ యాట సంధ్య తెలంగాణకు సాంస్కృతిక రాయబారిగా గుర్తింపు పొందుతున్నారు. గ్రామీణ ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తే ప్రపంచ స్థాయికి ఎదగవచ్చని ఆమె విజయగాథ మరోసారి నిరూపిస్తోంది.

# ఘనంగా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు




**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ :** మాజీ మంత్రి జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు హుజూర్ నగర్ మండల కేంద్రంలో మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మిర్యాలగూడెం రోడ్ లో కేక్ కట్ చేసి, అనంతరం హుజూర్నగర్ టౌన్ హాల్లో రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదీష్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి నేటి వరకు పార్టీకి అంకితభావంతో సేవలందిస్తూ, జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అమర్ గౌడ్, దొడ్డ నరసింహారావు, పచ్చిపాల ఉపేందర్, రాథోడ్ కొండారెడ్డి, అలీ,పలువురు కౌన్సిలర్లు , సర్పంచులు, వార్డు నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# యువ సంగ్రామ సదస్సుకు షాబాద్ నుంచి భారీగా తరలిన బీఆర్ఎస్ నాయకులు



**క్రైమ్ మిర్రర్ -- షాబాద్:** రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు షాబాద్ మండలం నాగర్ గూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యువతకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించడం, రాష్ట్ర అభివృద్ధిలో వారి పాత్రను పెంపొందించడం లక్ష్యంగా పార్టీ యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తోందని తెలిపారు. పార్టీ అధినేత సూచించిన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాగర్ గూడ గ్రామం నుంచి వాహనాల ద్వారా పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు సరూర్ నగర్‌కు చేరుకుని సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ గూడా బిఆర్ఎస్ ప్రెసిడెంట్ బీరప్ప, గ్రామ మాజీ సర్పంచ్ ఈదుల కృష్ణ గౌడ్, బిఆర్ఎస్ యువ నాయకుడు ఈదుల సుధాకర్ గౌడ్, బేగరి పెంటయ్య, జంగయ్య, చాకలి చంద్రయ్య, దాసరి విట్టల్ గౌడ్, బిక్షపతి, సత్తయ్య, షర్ఫుదిన్, గోపాల్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, శ్రీకాంత్, టిల్లు అనిల్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దిండు వెంకటేష్ గౌడ్ పార్థియదేహానికి నివాళులర్పించిన పలువురు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** అనారోగ్యంతో మరణించిన బిజెపి సీనియర్ నాయకులు దిండు వెంకటేష్ గౌడ్ పార్థియదేహానికి పార్టీ కండువా కపి ఘన నివాళులర్పించిన అందెల శ్రీరాములు యాదవ్. అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, అర్బన్ రంగారెడ్డి రూరల్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లామాజీ బిజెపి అధ్యక్షులుబొక్క నరసింహ రెడ్డి, సరూర్నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, కాంగ్రెస్ టిఆర్ఎస్ నాయకుల పాల్గొని ఘన నివాళులర్పించారు



# స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్ద కాపర్తి నందు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పీఠం శ్రీధర్ అధ్యక్షతన గ్రామానికి చెందిన 2000-2001 పదో తరగతి పూర్వ విద్యార్థులు ప్రింటర్ ను బహుమానం గా పాఠశాలకు అందించి, తమతో కలిసి చదివి అకాల మరణం చెందిన స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. మర్రి గోపాల్ రెడ్డి విద్యార్థులకు రెండు లక్షల రూపాయలతో మూత్రశాలల నిర్మాణం చేసి అవి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అదేవిధంగా గ్రామ మాజీ సర్పంచ్ మర్రి జలంధర్ రెడ్డి గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో మొదటి రెండు ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు 8000 రూపాయలను బహుమానంగా అందించారు. మరొక దాత గ్రామానికి చెందిన కందిమల్ల మహేందర్ రెడ్డి పాఠశాలకు మూడు కంప్యూటర్ సిస్టమ్స్ బహుమానంగా అందించారు. ఈనాటి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటం వెంకటేష్ ,ఉప సర్పంచ్ ఓర్సు సైదులు పాఠశాల మాజీ ఎస్ఎంసి వైస్ చైర్మన్ నీలకంఠ నరేష్ , పూర్వ విద్యార్థులు ఏర్పుల భాస్కర్ ,ఎడ్ల నరేష్ ,పోషబోయిన యాదయ్య ,మునుకుంట్ల రాజు, ఏర్పుల మురళి ,తొలిసూరి నాగేష్, నుతి సత్యనారాయణ, జుంజు రాజు, , తాటి జానయ్య, ఎస్. రామకృష్ణ, ఏర్పుల రవి తదితరులు పాల్గొన్నారు

# పటాన్‌చెరు--కూకట్ పల్లి కోర్టు మధ్య రెండో బస్సు సర్వీస్ ప్రారంభం



**కూకట్ పల్లి, జూలై 18 (క్రైమ్ మిర్రర్) :** బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి కోర్టు వరకు రెండో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు బార్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు నుంచి బయలుదేరే బస్సు ఆర్‌సీ పురం, బీరంగూడ ఆర్చ్, అశోక్‌నగర్, భెల్ జంక్షన్, చందానగర్, గంగారం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ, లులు మాల్, నెక్సస్ మాల్, మలేషియన్ టౌన్‌షిప్, 9వ ఫేజ్ మీదుగా ప్రయాణించి ఉదయం 10:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టు నుంచి బయలుదేరి అదే మార్గంలో ప్రయాణించి సాయంత్రం 6:15 గంటలకు పటాన్‌చెరు చేరుకుంటుంది. ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సద్వినియోగం చేసుకుని బస్సు సేవ విజయవంతంగా కొనసాగేందుకు సహకరించాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్, గౌరవ న్యాయాధికారి టీజీఎస్‌ఆర్టీసీ అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి. పి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ గౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## జల్ సంచయ్ జన భాగీదారి' విజయవంతం చేయండి.. మున్సిపల్ కమిషనర్ ఎన్ మురళీకృష్ణ విజ్ఞప్తి



**రామకృష్ణాపూర్,జూలై 18 (క్రైమ్ మిర్రర్):** భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'జల్ సంచయ్ జన భాగీదారి' (జేఎస్‌జేబీ) 3.0 కార్యక్రమాన్ని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. నీటి సంరక్షణలో ప్రతి పౌరుడూ బాధ్యతగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యా, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత చురుగ్గా పాల్గొని వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, నీటి వృథాను నివారించి భూగర్భ జలాల పెంపునకు తోడ్పడాలని సూచించారు. స్థానిక చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తు తరాలకు నీటి భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. నీటి ప్రతి బొట్టూ అమూల్యమైనదని, ప్రజల సహకారంతోనే ఈ ప్రజా ఉద్యమం విజయవంతమవుతుందని కమిషనర్ స్పష్టం చేశారు.



## మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

**పోలీస్ అక్క కార్యక్రమంతో విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన**

**నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్.**



**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళా పోలీసుల ఆధ్వర్యంలో, పోలీస్ అక్క" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికల భద్రతకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థినులు నిర్భయంగా తమ విద్యను కొనసాగించేలా భద్రతా వాతావరణం కల్పించడమే "పోలీస్ అక్క" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మహిళా పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకూడదనే అంశాలపై జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాల లో అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడినా లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైనా వెంటనే డయల్-100, షీ టీమ్స్ కానీ, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సమస్య వచ్చినా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని విద్యార్థినులకు భరోసా కల్పించారు. అలాగే మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, మహిళలకు కల్పించిన హక్కులు, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై కూడా వివరించారు."పోలీస్ అక్క" కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## దామెర భీమనపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

**విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.**

**విద్యార్థి నాయకుడు సిలివేరు విష్ణు**



**నల్లగొండ నిఘా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ మండలంలోని దామెర భీమనపల్లి గ్రామానికి, ఎన్నో ఏళ్లుగా సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థి నాయకుడు, మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో, జిల్లా రీజినల్ మేనేజర్, ఆర్టీసీ డిపో మేనేజర్‌లను కలిసి గ్రామ ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిలివేరు విష్ణు మాట్లాడుతూ.. నల్లగొండ నుంచి లెంకలపల్లి, ఖమ్మగూడ, దామెర భీమనపల్లి, వట్టిపల్లి గ్రామాల మీదుగా వందలాది మంది విద్యార్థులు, ప్రతిరోజూ మర్రిగూడ మండల కేంద్రం, మాల్ పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు విద్యాభ్యాసం కోసం ప్రయాణిస్తున్నారని తెలిపారు. అయితే సరైన సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు రవాణా సౌకర్యం లేక చదువుకు దూరమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, నల్లగొండ నుంచి బయలుదేరే బస్సు ఉదయం 8:30 గంటలకు దామెర భీమనపల్లి చేరుకునేలా, అలాగే సాయంత్రం 4:30 గంటలకు మర్రిగూడ మండల కేంద్రం నుంచి తిరుగు బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిపో మేనేజర్ సమస్యను సానుకూలంగా పరిశీలించి, పది రోజుల్లో పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సిలివేరు విష్ణు తెలిపారు. గ్రామ ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు వీలైనంత త్వరగా బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులపై ఈ నెల 20న జరిగే సమీక్ష సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ఈ నెల 20న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు, చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశాల నిర్వహణపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ...., ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ (సోమవారం) ఉమ్మడి జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి వనరుల లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, వ్యవసాయ, ఉద్యాన పంటల ప్రస్తుత పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు అవకాశాలు, భూగర్భ జలాల స్థితి, విద్యుత్ సరఫరా, పశువులకు మేత, తాగునీటి ఏర్పాట్లు, నీటి సంరక్షణ చర్యలు, ఇతర శాఖల వారీగా చేపట్టిన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన తాజా గణాంకాలు, క్షేత్రస్థాయి సమాచారం, చేపట్టిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికతో సమావేశానికి హాజరు కావాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులను నివేదించేలా పూర్తి సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.నాగర్‌కర్నూల్ జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సోమవారం నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, భూగర్భ జలాల స్థితి, విద్యుత్ సరఫరా, పశుసంవర్ధక శాఖ చర్యలు, నీటి సంరక్షణ కార్యక్రమాలు తదితర అంశాలపై శాఖల వారీగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేసి సమగ్రంగా వివరించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.అదేవిధంగా సమావేశంలో చర్చించే ప్రతి అంశానికి సంబంధించి తాజా నివేదికలు, గణాంకాలు, కార్యాచరణ ప్రణాళికలను సిద్ధంగా ఉంచాలని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల అమలుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అరుణ రెడ్డి, వివిధ నీటిపారుదల, వ్యవసాయ, మిషన్ భగీరథ, శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భద్రతే లక్ష్యం.. మర్రిగూడలో 'పోలీస్ అక్క' కార్యక్రమం

**విద్యార్థినులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన.**

**సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని వ్యాపారులకు ఎస్ఐ సూచన.**



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, మర్రిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం "పోలీస్ అక్క" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు వ్యక్తిగత భద్రత, సామాజిక బాధ్యత, సైబర్ అవగాహన వంటి కీలక అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ గురించి బాలికలకు వివరించి, ఎలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలో సూచించారు. అలాగే పరిమితికి మించి సోషల్ మీడియా వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాలు, వ్యక్తిగత సమాచారం రక్షణ, చిన్న వయసులో ఆకర్షణలకు లోనుకాకుండా, చదువుపై దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మర్రిగూడ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ శిరీషను పోలీస్ అక్కగా నియమించినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఇదే తరహా అవగాహన కార్యక్రమాలను, దశలవారీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ**

ఈ కార్యక్రమం అనంతరం ఎస్ఐ రాంబాబు స్థానిక వ్యాపారులను కలిసి తమ దుకాణాల వద్ద, రోడ్డు వైపు కనిపించేలా కనీసం రెండు సీసీ కెమెరాలను అయినా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపు, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ప్రజల సహకారంతో మర్రిగూడలో మరింత పటిష్టమైన భద్రతా వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## చిన్నారి ఆర్యను దీవించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చిన్నారికి ఆశీస్సులు



**కూకట్ పల్లి, జూలై 18 (క్రైమ్ మిర్రర్)** :శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రజా ఖాతాల కమిటీ (పీఏసీ) చైర్మన్ అరికెపూడి గాంధీ చిన్నారి ఆర్య తొలి జన్మదిన వేడుకలకు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి మనవరాలు, ఎన్నారై కుమారుడు సందీప్, కోడలు వినూత్న దంపతుల ముద్దుల కుమార్తె చిరంజీవి ఆర్య మొదటి పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చిన్నారి ఆర్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చిన్నారిని ఆశీర్వదిస్తూ, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా, ఎల్లప్పుడూ చిరునవ్వుతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్నారి కుటుంబ సభ్యులను అభినందిస్తూ, ఆర్యకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో మాజీ కార్పొరేటర్ రోజా రంగారావు, భాస్కరరావు, సతీష్ రావు, కాంగ్రెస్ నాయకులు ఎన్. చంద్రకాంతరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జై శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు ఆర్. రామచంద్రరావు, డాక్టర్ ఎన్. వంశీ రెడ్డి, జి. నర్సింగరావు, జి. ప్రసాద్, ఆర్. కార్తీక్ రావు, శ్రీధర్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, పురుషోత్తం, కిషోర్తో పాటు కాలనీవాసులు, బంధువులు, మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారి ఆర్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జనంపల్లి పురంధర్ రెడ్డి మాట్లాడుతూ, తమ కుటుంబ ఆనందాన్ని పంచుకునేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, కాలనీవాసులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తమ మనవరాలు ఆర్యపై అందరూ చూపించిన ప్రేమ, అభిమానాన్ని జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు. ఈ వేడుక ఆత్మీయత, ఆనందోత్సాహాల నడుమ వైభవంగా సాగగా, చిన్నారి ఆర్యకు అందరూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె భవిష్యత్తు సుఖసంతోషాలతో, విజయాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు.



## ప్రతి అర్హుడికి ఓటు హక్కు -- ప్రతి ఓటరికి సరైన నమోదు

**ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమైన పునాది**

**టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్**

**కూకట్ పల్లి, జూలై 18 (క్రైమ్ మిర్రర్) :** "ప్రతి అర్హుడికి ఓటు హక్కు -- ప్రతి ఓటరికి సరైన నమోదు" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ ఎల్లమ్మ బండ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమైన పునాది అని అన్నారు. ఓటరు జాబితా కచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను మరింత బలోపేతం చేయడంలో ఎస్ఐఆర్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు మాత్రమే కాకుండా ప్రతి అర్హత కలిగిన పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు, కొత్త నమోదు, చిరునామా మార్పులు వంటి వివరాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. "సరైన ఓటరు జాబితా రూపొందడం అంటే ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి తమ వంతు సహకారం అందించాలి" అని ఆయన పేర్కొన్నారు. అలాగే కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారు, పరిసర ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి, వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ్ రెడ్డి, నాయకులు యాదగిరి గౌడ్, అశోక్ గౌడ్, అభిషేక్ గౌడ్, కట్ల శేఖర్ రెడ్డి, యలమంచి ఉదయ్ కిరణ్, మానేపల్లి సాంబశివరావు, దార్గుపల్లి ప్రభాకర్, కమ్మినేని వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, కాలనీవాసులు, టీం పట్వారి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# ప్రతి కేసులో శిక్షల శాతం పెంపే లక్ష్యం

## పోలీసు--ప్రాసిక్యూషన్ సమన్వయంతో నాణ్యమైన దర్యాప్తుకు ఎస్పీ పవార్ ఆదేశాలు




**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** జిల్లాలో నమోదవుతున్న క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా, దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు ప్రతి దశలో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ శాఖ సమన్వయంతో పనిచేయాలని, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నమోదవుతున్న పోక్సో, ఎస్సీ/ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం, ఎన్‌డీపీఎస్, హత్య, దోపిడీ వంటి తీవ్ర నేరాల కేసుల్లో, దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. ప్రతి కేసులో బలమైన సాక్ష్యాధారాలను సేకరించి, చట్టపరమైన అన్ని ప్రక్రియలను పకడ్బందీగా పూర్తి చేస్తేనే, శిక్షల శాతం పెంచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. శాస్త్రీయ ఆధారాల సేకరణ, చట్టపరమైన నిబంధనల అమలు, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**చార్జ్‌షీట్లు, సాక్ష్యాధారాల్లో నిర్లక్ష్యం వద్దు**

సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టు విచారణల సమయంలో, ఎదురవుతున్న సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చార్జ్‌షీట్లు, కేసు డైరీలు, ఫోరెన్సిక్ నివేదికలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు, డిజిటల్ సాక్ష్యాలు తదితర కీలక పత్రాలను, పూర్తి స్థాయిలో కోర్టుకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు అధికారులు ప్రతి కేసులో అవసరమైన అన్ని ఆధారాలను చట్టబద్ధంగా సేకరించి, ఎలాంటి లోపాలు లేకుండా కేసు డైరీలను సిద్ధం చేయాలని ఎస్పీ ఆదేశించారు. కోర్టు విచారణకు ముందే కేసులను సమగ్రంగా పరిశీలించి లోపాలను సరిదిద్దడం ద్వారా కేసులను మరింత బలపరచవచ్చని చెప్పారు. కోర్టులో సాక్ష్యం చెప్పే సాక్షులను ముందుగానే సంప్రదించి, విచారణ తేదీలపై అవగాహన కల్పించి నిర్ణీత సమయానికి కోర్టుకు హాజరయ్యేలా చూడటం కోర్టు కానిస్టేబుళ్ల ప్రధాన బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. సాక్షులు గైర్హాజరు కావడం, ఆలస్యంగా హాజరుకావడం వల్ల విచారణలు వాయిదా పడుతున్నాయని, ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోక్సో, ఎస్సీ/ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం తదితర అర్హత కలిగిన కేసుల్లో, నిందితులకు శిక్ష పడిన అనంతరం ప్రభుత్వం అందించే పరిహారం గురించి, బాధితులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. అలాగే ప్రాసిక్యూషన్ అధికారులు కేసుల్లో గుర్తించిన లోపాలను, వెంటనే దర్యాప్తు అధికారులకు తెలియజేసి, వాటిని సకాలంలో సరిదిద్దేలా పరస్పర సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రతి కేసును బలమైన సాక్ష్యాధారాలతో సమర్థవంతంగా కోర్టులో ప్రవేశపెడితేనే నిందితులకు శిక్షలు విధించబడతాయని, తద్వారా ప్రజల్లో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ శాఖ, న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. ఇలాంటి సమీక్ష సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, కేసుల పురోగతి, లోపాలు, పరిష్కార మార్గాలపై చర్చించి జిల్లాలో శిక్షల శాతాన్ని మరింత పెంచేందుకు పోలీసు--ప్రాసిక్యూషన్ శాఖలు ఉమ్మడిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రవి, శ్రీనివాస్ రావు, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీవాణి, అఖిల, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ఆల్విన్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుల చొరవ

## ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్ వద్ద పైప్‌లైన్ వాల్వ్ మరమ్మతుల పనులను పరిశీలించిన జిల్లా గణేష్

## రెండు, మూడు రోజుల్లో నీటి సరఫరా సాధారణ స్థితికి వస్తుందని హామీ



**కూకట్ పల్లి, జూలై 18 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124వ డివిజన్ పరిధిలో గత వారం రోజులుగా తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నీటి మోటార్లు దెబ్బతినడంతో గ్రావిటీ విధానంలో నీటిని పంపిణీ చేయాల్సిన పరిస్థితి నెలకొనగా, స్థానిక ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌లోని వాల్వ్ మరమ్మతుల పనులు చేపట్టడంతో ట్యాంక్‌కు నీటి నిల్వ పూర్తిగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్ నేత ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ తో కలిసి ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని మరమ్మతుల పనులను పరిశీలించారు. వాల్వ్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించేలా అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ, గత వారం రోజులుగా రెండు నీటి మోటార్లు కాలిపోవడంతో నీటి విడుదలలో తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో కాలిపోయిన రెండు మోటార్లకు మరమ్మతులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రెండు నుంచి మూడు రోజుల్లో మోటార్ల మరమ్మతులు పూర్తవుతాయని, అనంతరం తాగునీటి పంపిణీ యథావిధిగా ప్రారంభమై సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలు కొంత సహనం పాటించాలని కోరుతూ, నీటి సమస్యను పూర్తిగా అధిగమించేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. స్థానికులు కూడా నీటి సమస్యపై కాంగ్రెస్ నాయకులు, అధికారుల తక్షణ స్పందనను అభినందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సుకు భారీ స్పందన

## నిరుద్యోగ యువత హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది: కేటీఆర్

సభ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కృతజ్ఞతలు

క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,జూలై 18: సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన లి"యువ సంగ్రామ సదస్సు"లికు వేలాదిగా నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై సభను విజయవంతం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగాల కల్పన, జాబ్ క్యాలెండర్ విడుదల, ఉద్యోగ నోటిఫికేషన్ల జాప్యంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు, ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ యువత పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సభకు హాజరైన నిరుద్యోగ యువత, విద్యార్థులు తమ సమస్యలను గళమెత్తి వినిపిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భారీ జనసందోహం, క్రమశిక్షణ, యువతలో కనిపించిన ఉత్సాహం, ప్రజల పోరాట స్ఫూర్తి సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు చూపిన అపూర్వ ఆదరణ, విశ్వాసం తమపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్న ఆయన, ప్రజా సమస్యల పరిష్కారం, నిరుద్యోగ యువత హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీతో కలిసి ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు.

# నీట్ 2026 ఫలితాలలో అగ్రగామి ఖమ్మం డాక్టర్స్ మెడికల్ అకాడమి సంస్థ

### ఇష్టంగా విద్యాభ్యాసం అనూహ్య ఫలితాలు..విద్యార్థుల్లో నూతనోత్తేజం

### ఖమ్మం డీఎంఎ సంస్థ ఆవరణలో మీడియా సమావేశంలో డాక్టర్స్ మెడికల్ అకాడమీ సంస్థ డైరెక్టర్లు రాయల సతీష్ బాబు భరణి కుమార్ వివరాలు వెల్లడి




**క్రైమ్ మిర్రర్ ఖమ్మం:** డాక్టర్ కావాలనే ఆకాంక్ష అందరి విద్యార్థుల్లో ఉంటుంది.కానీ ఖమ్మం జిల్లాలో డాక్టర్స్ మెడికల్ అకాడమీ సంస్థ విద్యా సేవల్లో సులభతరమైన సరళీకృత వినూత్న విద్యా విధానతరహాలో విద్య న బ, ్య సి ం చి న విధ్యాకుసుమాలు తమ సత్తాని చాటి ఉత్తమ ఫలితాల శిఖరంతో కూడిన ఖమ్మం గుమ్మాన్నీ తెలంగాణ చిత్రపటంలో చేర్చిన ఘనత ఖమ్మం డాక్టర్స్ మెడికల్ అకాడమీ సంస్థకు, వారి స్టూడెంట్స్ కే దక్కింది.ఈమేరకు యావత్ తెలంగాణ సమాజం వారికి అభినందనలు తెలిపింది.నాణ్యమైన విద్యా ప్రమాణాలతో ముందుకు సాగుతూ ఖమ్మం జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ సంస్థ అగ్రగామిగా నిలిచిందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.ఇటీవల విడుదలైన నీట్ -2026 ఫలితాలలో ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా డాక్టర్స్ మెడికల్ అకాడమీ పతాకస్థాయి ఫలితాలను కైవసం చేసుకుంది. ఆలిండియా ర్యాంకు 237 సాధించడమే కాకుండా అంచనాల ప్రకారం 122 మందికి గవర్నమెంట్ కోటాలో ఎంబిబిఎస్ సీట్లను సాధించే దిశగా అడుగులు వేస్తుంది. సాధారణ । విద్యార్థులతో ఎటువంటి ఐఐటీ ఫౌండేషన్ లేని విద్యార్థులకు ఈ తరహ ఫలితాలు సాధింపచేయటం కేవలం డాక్టర్స్ । మెడికల్ అకాడమీ కే సాధ్యమని డైరెక్టర్లు రాయల సతీష్ బాబు భరణి కుమార్ లు హర్షం వ్యక్తం చేశారు. అకాడమీ విద్యార్థులు మార్కులు 500 పైన 4 గురు, 450 పైన 30 మందికి, 400 పైన 107 మందికి గవర్నమెంట్ కోటాలో సీట్లు దాదాపుగా 122 మందికి వచ్చే అవకాశాలున్నట్లు యాజమాన్య వర్గాలు తెలిపాయి. రాహుల్ చైతన్య - 554, మీనాక్షి-531, ప్రశాంత్ 500, వైష్ణవి-500, ఆదిత్య- 499, షారోన్ రోజా-494, కిషోర్ - 490, లోహి - 486, రోహిణి 485, రాబర్ట్ చౌహాన్ 484, నిస్సీ- 479, మేఘన - 475, సానియా 475, - 472, - 470, 2 - 469, - 466, - 464, ?? - 463, ??? - 462, ?? - 455, -454, - 453, - 453, ( - 452, 5 - 452, భవ్యశ్రీ 451, కావేరీ 450, వర్ష-450. ఇంతే కాకుండా ఇంకా ఎంతో మంది విద్యార్థులు అధిక మార్కులు సాధించారని చెప్పటు హర్షాతిరేకంతో విద్యార్థులు అధ్యాపకులు యాజమాన్యం సంబురంగా సంబరాలు జరుపు కున్నారు.



# పీవీ రమణ తండ్రి వెంకయ్య మృతికి బండి రమేష్ ప్రగాఢ సంతాపం

**కూకట్ పల్లి, జూలై 18 (క్రైమ్ మిర్రర్) :** కేపీహెచ్‌బీ 3వ రోడ్డులోని శివాలయం చైర్మన్ పీవీ రమణ తండ్రి వెంకయ్య స్వర్గస్తులైనట్లు తెలిసి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ వారి స్వగృహానికి వెళ్లి వెంకయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకయ్య మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని, వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని బండి రమేష్ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, దినేష్, రాజేష్, అరవింద్, గోపాల్, గంధం రాజు, రంగమోహన్, పనీంద్ర, శ్రీనివాస్ బాబు, ఎల్లేష్ యాదవ్, నరసింహ, శ్రీకాంత్ పటేల్, రవి, రజిత, సుజాత, వాణి తదితరులు పాల్గొని వెంకయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బోగస్ యూత్ డిక్లరేషన్ ను ఎండగట్టాలి

## మూసాపేట్ డివిజన్ నుండి యువ సంగ్రామం సభకు భారీగా తరలిన యువత



**కూకట్ పల్లి, జూలై 18 (క్రైమ్ మిర్రర్) :** గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బోగస్ యూత్ డిక్లరేషన్ ను ఎండగడుతూ బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన యువ సంగ్రామం సభకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలమేరకు మూసాపేట్ డివిజన్ నుండి మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో యువత భారీగా తరలి వెళ్లారు. అనంతరం మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుంది తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ నాయకులు తూము మనోజ్, అక్షయ్, రాజేష్, గిరీష్, గణపతి, ఉప్పు సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు



**క్రైమ్ మిర్రర్ , గరిడేపల్లి :** రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, ఇండ్లు లేని అర్హులైన అందరికి ఇండ్లను ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ శ్రవంతి కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గతం లో అధికారం లో వున్న ప్రభుత్వాలు పేదలకు ఇండ్లు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తున్నామని చెప్పి అవి పూర్తి కాకుండానే పాలకులు మారారని ఆయన అన్నారు.ఆ కారణం గా లక్షలమంది పేదలు, వానకు కురిసే, ఎండకు ఎండే ఇండ్లలో బిక్కు బిక్కు మంటూ నివసిస్తున్నారని, తుపాన్ వచ్చిందంటే కుటుంబం మొత్తం వర్షంలోనే వుండే పరిస్థితి వున్నదని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని,ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం లో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను పేదలకు ఇస్తోందని, అవి అర కొరగా కాకుండా అర్హులైన అందరికి ఇవ్వాలని ఆయన కోరారు.పేదవారికి, అసలు ఇండ్లు లేక నిరాశ్రయులుగా వున్న వారికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు త్రిపురం సుధాకర్ రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, చిల్లా నరేష్, పిట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 1200 వాహనాలతో సరూర్‌నగర్‌కు గులాబీ దండు

- జీఎంఆర్ జెండా ఊపడంతో ప్రారంభమైన భారీ ర్యాలీ
- జాబ్ క్యాలెండర్‌పై కాంగ్రెస్‌ను నిలదీసిన ఎమ్మెల్యే
- యువ సంగ్రామ సదస్సుకు పటాన్‌చెరు నుంచి భారీ స్పందన
- 2028లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుంది: జీఎంఆర్
- నిరుద్యోగ యువతకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలం: జీఎంఆర్
- యూత్ డిక్లరేషన్ హామీలు అమలు కాలేదని విమర్శ
- పల్లెలు, పట్టణాల నుంచి కదం తొక్కిన బీఆర్ఎస్ శ్రేణులు





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, జూలై 18:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యూత్ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని అడిగితే నిరుద్యోగులను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, 2028 ఎన్నికల్లో తిరిగి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి సుమారు 1,200 వాహనాల్లో భారీగా పార్టీ శ్రేణులు, యువత, నిరుద్యోగులు తరలివెళ్లారు. శనివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఎమ్మెల్యే జీఎంఆర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పటాన్‌చెరు పురవీధుల గుండా ఓఆర్ఆర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ 2023లో సరూర్‌నగర్ వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆ హామీలను నమ్మి యువత, నిరుద్యోగులు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించినా రెండున్నర సంవత్సరాలు గడిచినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఓటు కొట్టు--జాబ్ పట్టు అని హామీలు ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఉద్యోగాలపై ప్రశ్నిస్తున్న నిరుద్యోగులను అవమానించేలా మాట్లాడుతోందని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేయడంలో విఫలమైన ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తప్పుడు ఆశలు చూపించి అధికారంలోకి వచ్చిందని, ప్రజలు త్వరలోనే తగిన తీర్పు ఇస్తారని పేర్కొన్నారు. 2028లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు సువర్ణయుగం రానుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థులు, మహిళా, కార్మిక విభాగాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## వాన నీటి ప్రతి చుక్క... భవిష్యత్తుకు భరోసా..!

**అన్నా మెమోరియల్ స్కూల్ లో 'జాతీయ జల మిషన్' జల ప్రతిజ్ఞ**

**మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

**సిఐ జి.మన్మధ కుమార్**

**చౌటుప్పల్, జులై 18,క్రైమ్ మిర్రర్:** భూగర్భ జలాలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, రాబోయే రోజుల్లో నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం చౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'జాతీయ జల మిషన్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అన్నా మెమోరియల్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, సీఐ జీ. మన్మధ కుమార్ లు హాజరై విద్యార్థులు, పాఠశాలసిబ్బందితో 'జల ప్రతిజ్ఞ' చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అధికారిక హెచ్చరికలు ఉన్నందున, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను తప్పనిసరిగా నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చూడడం ద్వారానే భూగర్భ జల మట్టాలను పెంచుకోగలమని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు అగ్రభాగంలో నిలిచి భాగస్వాములు కావాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చిన్నపరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బుడ్డ సురేష్ ,చింతల ఉమామహేశ్వరి, నాయకులు పంతంగి మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, ప్రిన్సిపాల్స్ సునీత, రాణి,మున్సిపల్ అధికారులు హనుమాన్ ప్రసాద్, రేణు కుమార్,వార్డు ఆఫీసర్లు పవన్ కుమార్, కిరణ్ కుమార్,శ్రీనాథ్, ఉపేందర్ , జవాన్ వంశీ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్.ఆర్.విద్యాభవన్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన బస్తీ అధ్యక్షుడు చంద్రా రెడ్డి



**కూకట్ పల్లి, జూలై 18 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని ఆర్.ఆర్.విద్యాభవన్ పాఠశాల లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, పాఠశాల నిర్వాహకులు సుబ్రహ్మణ్యం తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు, స్థానికులకు పలు చికిత్సలు ఉచితంగా నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. అనంతరం చికిత్సలు పొందిన విద్యార్థుల కు, స్థానికులకు చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్యం వెంకటరెడ్డి, బి. ఎల్లారెడ్డి, శ్రీనివాసరావు, డి.తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## యువ సంగ్రామ సదస్సుకు తరలిన చెన్నూర్ బీఆర్ఎస్వీ నాయకులు



**చెన్నూర్, జూలై 18 (క్రైమ్ మిర్రర్ ):** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'యువ సంగ్రామ సదస్సు'కు చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు శనివారం తరలివెళ్లారు. సదస్సును విజయవంతం చేసేందుకు ఆసంపెల్లి సంపత్‌కుమార్, ఎండీ నాయాబ్, గోగార్ల శివ, చినాల ప్రశాంత్‌రెడ్డి, చెన్నూరి ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు చెన్నూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సరూర్‌నగర్ వేదికగా ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్'లోని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపించారు. యువతకు ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ అదే సరూర్‌నగర్ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. నిరుద్యోగుల హక్కుల సాధన కోసం కేటీఆర్ పిలుపు మేరకు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు.

## భక్తజన సంద్రమైన ప్రగతి నగర్

**వైభవంగా జగన్నాథుని రథోత్సవం**



నిజాంపేట్, జూన్ 18 (క్రైమ్ మిర్రర్): ప్రగతి నగర్‌లో శ్రీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ పవిత్ర రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, జగన్నాథుని రథాన్ని లాగి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భజనలు, కీర్తనలు, నృత్యాలు మరియు ప్రసాద వితరణతో ప్రగతి నగర్ వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భక్తజన సంద్రంగా మారాయి.

**ఘనంగా ప్రారంభమైన రథోత్సవం**

సాయి కృష్ణ కాలనీ వేదికగా సాయంత్రం ఈ రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన దివ్య రథంపై కొలువైన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవిలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. "హరే కృష్ణ" నామస్మరణతో, భక్తిశ్రద్ధలతో భక్తులంతా రథాన్ని ముందుకు లాగారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి నియోజకవర్గ ప్రముఖులతో పాటు పలు పార్టీల నాయకులు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రథయాత్ర కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కోలాన్ రాజశేఖర్ రెడ్డి, ప్రగతి నగర్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, బండారి లేఔట్ అధ్యక్షుడు వాసు వరగాని, బాచుపల్లి అధ్యక్షుడు కోలన్ జీవన్ రెడ్డి నాయకుడు మెడ శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు ప్రగతి నగర్ నాయకులు వడ్లకొండ సందీప్, బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, హరీష్, గోవిందరావు, శివ రామ కృష్ణ, స్థానిక మహిళలు, భక్తులు మరియు కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొని, యాత్ర పొడవునా స్వామివారికి హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. రథయాత్ర విజయవంతం కావడానికి సహకరించిన భక్తులందరికీ మరియు నిర్వాహకులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు.



## కాంగ్రెస్ అరాచక పాలనపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పౌరుల రాజ్యాంగ హక్కులను నిస్సిగ్గుగా కాలరాస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. నిరుద్యోగ యువత తరఫున గళమెత్తేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ని ప్రభుత్వం అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడం రాష్ట్రంలో కలకలం రేపింది. సరూర్‌నగర్ స్టేడియంలో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు వెళ్లకుండా పోలీసులు ఆయనను గృహనిర్బంధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అణచివేత ధోరణిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శల విరుచుకుపడ్డారు. యువ సంగ్రామ సదస్సుకు గౌరవ హైకోర్టు పర్మిషన్ ఇచ్చినప్పటికీ, అలాగే మల్కాజిగిరి సీపీ సుమతి స్వయంగా ఈ సదస్సుకు అనుమతినిచ్చినప్పటికీ... బీఆర్ఎస్ నాయకులను వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం అత్యంత దారుణమని నేతలు మండిపడ్డారు. రేవంతూ నిరుద్యోగ యువత తరఫున బీఆర్ఎస్ గళమెత్తితే ఇంత భయమెందుకు? అని వారు ప్రశ్నించారు. ఒకవైపు ఢిల్లీలో రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని పెద్ద పెద్ద నీతులు చెబుతుంటే, ఇక్కడ తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి పౌరుల హక్కులను తొక్కిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా సదస్సుకు హాజరవ్వకుండా అడ్డుకుంటే, ఈ ప్రభుత్వ అణచివేతకు నిరసనగా ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసనలో సర్కిల్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఏరోళ్ల యాదయ్య, సరికొండ దుర్గేష్, వీర్లపల్లి నవీన్ కుమార్, నాగేష్, విజయ్, గిర్రి బాబు, రాము యాదవ్, యాదయ్య, నికిలేష్, ధీరజ్, ఈ. చింటూ, సతీష్ నాని, అఖిల్, ఈ. నీరజ్, బీఆర్ఎస్వీ ప్రెసిడెంట్ నికిలేష్ రెడ్డి, అనుదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వేముల వీరేశం

**వాటర్ ప్లాంట్,ఇందిరమ్మ ఇళ్లు, ఐకేపీ సెంటర్ ఏర్పాటుకు హామీ,బొంగొనిచెర్వులో రూ.63 లక్షల అభివృద్ధి పనులు**





**చిట్యాల క్రైమ్ మిర్రర్:** రాష్ట్ర ప్రభుత్వము గ్రామీణ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం బొంగొనిచెర్వు గ్రామంలో రూ.63 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేతతో కలిసి నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బొంగొనిచెర్వును గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. రైతులు, మహిళల సౌకర్యార్థం గ్రామంలో ఐకేపీ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల పాలు చేసిందని, గతంలో ప్రజలకు నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీలేని రుణాలు వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తున్నామని, గత ప్రభుత్వంలో రైతులకు తగిన సబ్సిడీలు అందలేదని, ఇప్పుడు రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో విజయ్ కుమార్, ఎంపీడీవో జెల్లా పాండు, ఎంసీ చైర్మన్ నరా వినోద మోహన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకన్న, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ, గ్రామ సర్పంచ్ కట్ట ఆశయ్య, ఉప సర్పంచ్ సాయి కృష్ణారెడ్డి,బొంతల అంజిరెడ్డి, వేలిమినేడు ఉపసర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్,అంతటి నరసింహ గౌడ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి,చిన్నకాపర్తి సర్పంచ్ ఆవుల సుందర్,పల్లపు బుద్ధుడు,మాజీ సర్పంచ్ సామెడి మోహన్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు కందాటి మహేందర్ రెడ్డి, గోలి అరవింద్ , మెట్టు మనోహర్ ,వార్డు మెంబర్లు, సెక్రటరీ తాటికొండ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు ప్రగతి పనుల్లో వేగం పెంచండి

### నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదు

### గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి

### ప్రజా దర్బార్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

### ఉన్నత స్థాయి సమీక్షలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** కూసుమంచి పాలేరు నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని, ప్రజలకు వీటి ఫలాలు త్వరితగతిన అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శనివారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పురోగతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి మంత్రి వివిధ శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ శాఖల వారీగా ఇప్పటివరకు మంజూరైన పనులు, టెండర్ల ప్రక్రియ, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సాగుతున్న పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన టెండర్ల అడ్డంకులను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

**గడువు దాటితే కుదరదు..**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పెండింగ్ బిల్లుల వివరాలను వెంటనే సమర్పించాలని సూచించారు.

**శాఖల మధ్య సమన్వయం ముఖ్యం**

అభివృద్ధి పనులు వేగంగా సాగాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. అధికారులు ఒకరితో ఒకరు చర్చించుకుంటూ ముందుకెళ్లాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు.'ప్రజా దర్బార్' వేదికగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వీటికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో భూముల రీ-సర్వే ప్రక్రియకు తగిన చర్యలు చేపట్టాలన్నారు.పాలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి ఆకాంక్షించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు తహసీల్దార్లు పాల్గొన్నారు.

# అర్బన్ ఎంప్లాయిమెంట్ జస్టిస్ క్యాంపెయిన్‌లో భాగంగా ఖమ్మంలో వీధి వ్యాపారులతో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ ముఖాముఖి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అఖిల భారత యువజన కాంగ్రెస్ మరియు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహిస్తున్న "అర్బన్ ఎంప్లాయిమెంట్ జస్టిస్ క్యాంపెయిన్" లో భాగంగా ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ ఖమ్మం నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో పర్యటించి వీధి వ్యాపారులు, కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, సంక్షేమ పాలనకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తూ వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని విమర్శించారు. నోటీసులు ఇవ్వకుండా వీధి వ్యాపారులను బలవంతంగా ఖాళీ చేయించడం అత్యంత అమానుష చర్య అని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆధునీకరణ పేరుతో వీధి వ్యాపారుల దుకాణాలను తొలగించడం, సరుకులను స్వాధీనం చేసుకోవడం వల్ల వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సుమారు ఒక కోటి మంది వీధి వ్యాపారులు తమ కుటుంబాల జీవనోపాధి కోసం శ్రమిస్తున్నారని పేర్కొంటూ, స్ట్రీట్ వెండర్స్ (జీవనోపాధి రక్షణ మరియు వీధి వ్యాపార నియంత్రణ) చట్టం--2014 అమలులో ఉన్నప్పటికీ అనేక పట్టణాల్లో సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. చట్టాన్ని అమలు చేయకుండా బలవంతపు ఖాళీ చేయింపులు చేపట్టడం రాజ్యాంగం కల్పించిన జీవన హక్కును ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేజండ్ల సాయికుమార్ చేసిన ప్రధాన డిమాండ్లు వీధి వ్యాపారులను ఖాళీ చేయించే ముందు తప్పనిసరిగా చట్టబద్ధమైన ముందస్తు నోటీసులు ఇవ్వాలి. స్ట్రీట్ వెండర్స్ చట్టం--2014ను దేశంలోని అన్ని పట్టణాల్లో పూర్తిగా అమలు చేయాలి. టౌన్ వెండింగ్ కమిటీలను బలోపేతం చేసి, వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, శాశ్వత వ్యాపార స్థలాలు కల్పించాలి. అందీకరణ పేరుతో పేదల జీవనోపాధిని నాశనం చేసే చర్యలను వెంటనే నిలిపివేయాలి. వీధి వ్యాపారుల కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనోపాధి, సామాజిక భద్రత, పిల్లల విద్యకు అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించాలి. చివరిగా, ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వీధి వ్యాపారుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేసిన వేజండ్ల సాయికుమార్, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టేందుకు యువజన కాంగ్రెస్ సిద్ధంగా ఉందని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో యువజన కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ అంజనీ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ గౌడ్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్స్ జంగం రాజేష్, సన్నీ యాదవ్, మండల అధ్యక్షులు రామకృష్ణ, నిమ్మల నాగేశ్వరరావు, మరియు యువజన కాంగ్రెస్ నాయకులు కొండూరి హృదయ్ కిరణ్, దారేల్లి రాకేష్, యడ్లపల్లి తరుణ్, ఉసికల జీవరత్నం తదితర నాయకులు పాల్గొన్నారు.



# మిర్చి రైతుల నమ్మకాన్ని దోచుకున్న మోసగాళ్లు

### అధిక ధరలు ఇస్తామని చెప్పి రూ.90 లక్షలు ఎగవేత

### ఇద్దరు నిందితుల అరెస్ట్.. కీలక పత్రాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

### కేసు ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందన

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** అధిక ధరలకు మిర్చి కొనుగోలు చేస్తామని నమ్మించి రైతులకు సుమారు రూ.90 లక్షల మేర మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. మల్లేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మొగుళ్ళపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన మిర్చి రైతులను నిందితులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే భట్టికి రూ.2,000 నుంచి రూ.4,000 వరకు అధిక ధర చెల్లిస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన రైతులు సుమారు రూ.1.20 కోట్ల విలువైన మిర్చిని విక్రయించగా, నిందితులు కేవలం రూ.30 లక్షలు మాత్రమే చెల్లించి మిగిలిన రూ.90 లక్షలు చెల్లించకుండా మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం మిర్చి బస్తాలను ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసి, కొంత మిర్చిని విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలు, విలాసాలకు వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదైన విషయం తెలుసుకున్న నిందితులు తమ ఆస్తులను ఇతరుల పేరిట బదిలీ చేసి పరారైనట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జజూ భూపాలపల్లి, మొగుళ్ళపల్లి పోలీసుల సంయుక్త ప్రత్యేక ఆపరేషన్‌లో ఏ-1, ఏ-2 నిందితులను రంగాపూర్ గ్రామంలో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఎవెస్కె ఆగ్రోస్ , ఆర్ -ఎంటర్ప్రైజెస్ కు సంబంధించిన కీలక పత్రాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన చిట్యాల సీఐ డి. మల్లేశ్, మొగుళ్ళపల్లి ఎస్ఐ సురేష్, మొగుళ్ళపల్లి పోలీసు సిబ్బంది, జజూ సీఐ రమేష్, ఎస్ఐ నరేష్‌లను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అభినందించారు.

# ఓటు హక్కు రాజ్యాంగం ఇచ్చిన వజ్రాయుధం

### బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు తొండ రవి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి దేశ రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన అతి పెద్ద వజ్రాయుధం ఓటు హక్కు అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు, ఎస్.ఐ.ఆర్ రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ తొండ రవి స్పష్టం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా హైదర్ గూడ లోని డోనాల్డ్ స్కూల్ పోలింగ్ స్టేషన్ (బూత్ నంబర్లు: 238, 239, 240, 241) శక్తి కేంద్రంగా బిజెపి తరఫున ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సహాయ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, ఫారాల భర్తీ ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తొండ రవి మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి ఓటును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా, వీలైనంత త్వరగా ఫారమ్స్ పూర్తి చేసి అందించాలని సూచించారు. అలా ఇవ్వని పక్షంలో ఓటు డిలీట్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పుడు ఫారమ్స్ తిరిగి సమర్పించిన వారికి మాత్రమే ఆగస్టు 10వ తేదీ తర్వాత మార్పులు, చేర్పులు (కరెక్షన్స్) చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారమ్స్ అందని వారు తమ ఓటర్ ఐడీ కార్డు లేదా ఆధార్ కార్డుతో హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చు. మీ ఫారమ్ ఏ బీఎల్ఓ దగ్గర ఉందో బిజెపి కార్యకర్తలు యాప్ ద్వారా పరిశీలించి వివరాలు తెలియజేస్తారు. ఓటర్ల సహాయార్థం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సోషల్ జాయింట్ కన్వీనర్ మధుమోహన్ రెడ్డి, వరుణ్ రాజే, రంగారెడ్డి జిల్లా బిజెపి ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్, అత్తాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సులిగే వెంకటేష్, బీ.ఎల్.ఏ-2 నారగూడెం సోంనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు చెట్టిగారి శేఖర్, కవేలిగూడెం బాలు, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతి ఓటర్ బాధ్యతగా తమ ఓటును కాపాడుకోవాలి

### కాంగ్రెస్ మండల కో ఆర్డినేటర్ మీసాల ఉపేందర్

**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ ప్రోగ్రాంను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం పాలకవీడు మండలంలో విజయవంతం చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ మీసాల ఉపేందర్ తెలిపారు. శనివారం పాలకవీడు మండలంలోని హన్మయ్యగూడెం, నాగిరెడ్డి గూడెం, 58,59 బూత్ లలో సర్ ప్రోగ్రాం జాబితను పరిశీలించి మాట్లాడారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి హుజూర్నగర్ నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాంను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. అర్హులైన వారి ఓట్లను జాబితాలో ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు.ఒక ఓటు కూడా మిస్ కాకుండా జాబితాలో ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.మండలంలో తమ పార్టీ ఏజెంట్లు, నాయకులు బూత్ లెవెల్ ఆఫీసర్లు కృషి తో,21287 ఓట్లకు గాను 17360 ఓట్లు 81.55 శాతం డిజిటలైజెసన్ పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలిన ప్రతి ఓటర్ బాధ్యతగా తమ ఎన్యూమరేషన్ ఫాం సకాలంలో అందించి తమకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకొని, వినియోగించుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి గూడెం సర్పంచ్ మంద నాగయ్య, హన్మయ్య గూడెం ఉపసర్పంచ్ ఒంటెద్దు సైదిరెడ్డి, బి ఎల్ ఓ లు మణెమ్మ, దనమ్మ,కో ఆర్డినేటర్ పేరుమల్ల రమేష్, నాయకులు మల్గిరెడ్డి సైదిరెడ్డి, ఒంటెద్దు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థికి వస్త్రాల పంపిణీ



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు షేక్ యూసుఫ్ అధ్యక్షతన జెడ్పిఎచ్ఎస్ నేరేడుచర్ల లో చదువుతున్న విద్యార్థి అయ్యప్పకు సుమారు రూ.2,000 విలువైన వస్త్రాలను క్లబ్ కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో అందజేశారు.ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు మాట్లాడుతూ, అయ్యప్ప తల్లి నాగమ్మ ఎన్నో కష్టాలు పడుతూ, యాచిస్తూ తన కుమారుడిని చదివించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆమె సంకల్పానికి అండగా నిలుస్తూ లయన్స్ క్లబ్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అయ్యప్ప ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, జీఎంటీ లాయర్ విశ్వనాథం, సభ్యులు శావయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, జ్యోతి నాగమణి, రషీద్ ఖాన్, జానయ్య, నరసింహారావు, బికోజి తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఖమ్మం భద్రాద్రి ఆయుష్ ఫార్మసిస్టుల యూనియన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** టీఎన్జీవోస్ యూనియన్ అనుబంధంగా ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఆయుష్ శాఖ ఫార్మసిస్టుల సంఘం ఎన్నికలు శనివారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు.రెండు జిల్లాల ఫార్మసిస్టులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు గా గంగిశెట్టి వీరయ్య ప్రధాన కార్యదర్శి మన్సింగ్ కోశాధికారి శ్రీనివాస్ అసోసియేట్ అధ్యక్షులు రామకృష్ణ ఉపాధ్యక్షులు అరుణ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావుక్రీడా కార్యదర్శి జయశ్రీఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫార్మసిస్ట్ సంఘం మాజీ అధ్యక్షులు ఎస్ ప్రకాష్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు వి టీ దాస్ ఎన్నికల పరిశీలకులుగా హాజరై ప్రక్రియను పర్యవేక్షించారు. టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు జిల్లా కార్యదర్శి కొణిదెనా శ్రీనివాస్ రాష్ట్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ జయపాల్ తదితరులు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన కమిటీ ఫార్మసిస్టుల సంక్షేమం కోసం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షులు గంగిశెట్టి వీరయ్య తెలిపారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption




# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ప్రోటోకాల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్‌ను ఖచ్చితంగా అమలు చేయాలి
- వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పార్కింగ్ ప్రణాళిక రూపొందించాలి
- అంజనాపురంలో ముఖ్యమంత్రి పర్యటన సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. వైరా నియోజకవర్గం కొణిజెర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లు సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రోటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి గ్యాలరీకి స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వీఐపీ పాస్‌లను అవసరానికి మించి జారీ చేయరాదని స్పష్టం చేశారు. సభా వేదికను సుమారు 100 మంది బరువును తట్టుకునే విధంగా నిర్మించాలని, అయితే ప్రోటోకాల్ ప్రకారం డయాస్‌పై సీట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్ ను ముందుగానే సిద్ధం చేసి, ప్రతి శాఖ అదే ప్రకారం బాధ్యతలు నిర్వహించేలా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు శాఖ అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా



ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. మీడియా, అధికారులు, వీఐపీలు, వీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, సభా ప్రాంగణంలో అవసరమైన బారికేడింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వాహనాలు, వీఐపీ వాహనాలు, ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గోద్రెజ్ సంస్థ తరపున కార్యక్రమంలో ప్రసంగించే ప్రతినిధి వివరాలను ముందుగానే ఖరారు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆడియో, వీడియో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వీడియోతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను కార్యక్రమంలో ప్రదర్శించే అంశాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ సభకు హాజరయ్యేవారందరికీ స్పష్టంగా కనిపించేలా అవసరమైన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి, మంత్రులకు అందించే ఆహార నాణ్యతను ఆహార తనిఖీ అధికారి స్వయంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. కార్యక్రమానికి అవసరమైన సురక్షిత త్రాగునీటిని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రోటోకాల్‌కు అనుగుణంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, అత్యవసర వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తగినంత ఇంధనంతో స్టాండ్‌బై జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ తమకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మణికొండ-నెక్నాంపూర్‌లో ఎస్ఐఆర్ పై నిర్లక్ష్యం-వాసిరెడ్డి నరేష్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ, నెక్నాంపూర్ డివిజన్లలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్(మీడియా అండ్ మ్యూనికేసన్) వాసిరెడ్డి నరేష్ ఆరోపించారు. సుమారు 80 వేల మంది ఓటు ఉన్న ఈ రెండు డివిజన్లలో ఇప్పటికీ సగానికి పైగా ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలు అందలేదని తెలిపారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్?మెంట్‌లలో ఇంటింటికీ వెళ్లాల్సిన బీఎల్‌వోలు కేవలం వాట్సప్‌లో ఫారాలు పంపి బాధ్యత ముగించినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలు, వృద్ధులు, మహిళలకు తగిన సహాయం లేకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఓటరుకి ఎస్ఐఆర్ ఫారం అందించి, అవసరమైతే నింపడంలో సహాయం చేసి తిరిగి స్వీకరించేలా ఎన్నికల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, బూత్ వారీ పురోగతి నివేదికలను బహిరంగంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం కొనసాగడితే సంబంధిత ఎన్నికల అధికారులతో పాటు భారత ఎన్నికల సంఘం దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్తామని హెచ్చరించారు.

## ప్రతిపాదిత క్యూర్ బిల్లుపై ది సిటీజన్స్ కౌన్సిల్ తీవ్ర అభ్యంతరాలు

### 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధమని ఏకగ్రీవ తీర్మానం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ప్రభుత్వం జీ.హెచ్.ఎం.సీ చట్టం 1955 స్థానంలో ప్రతిపాదించిన క్యూర్ బిల్లు పై పౌర సమాజంలో తీవ్ర చర్చ నడుస్తోంది. తాజాగా సీతారాం దూలిపాళ ఆధ్వర్యంలో జరిగిన ది సిటీజన్స్ కౌన్సిల్ ముఖ్య సమావేశంలో ఈ ప్రతిపాదిత బిల్లుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బిల్లులోని పలు నిబంధనలపై కౌన్సిల్ సభ్యులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, పలు సూచనలతో కూడిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రభుత్వం తలపెట్టిన వికేంద్రీకరణ ప్రక్రియ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాల్సింది పోయి, స్థానిక స్వపరిపాలనను దెబ్బతీసేలా ఉందని కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేసింది. అత్యధిక అధికారాలను రాష్ట్ర అపేక్ష కౌన్సిల్ ఆధీనంలో కేంద్రీకరించడం వల్ల పట్టణ స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తి పూర్తిగా దెబ్బతింటుందని, ఇది 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి సంపూర్ణ విరుద్ధమని స్పష్టం చేసింది. బిల్లులో ఆర్థిక అధికారాల బదలాయింపుపై ఎలాంటి స్పష్టత లేదని సభ్యులు పేర్కొన్నారు. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు తగిన ఆర్థిక అధికారాలు ఇవ్వలేదని అలాగే కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ, మేయర్ తదితర ప్రజాప్రతినిధుల ఆర్థిక హక్కులపై స్పష్టమైన నిబంధనలు లేకపోవడం వల్ల పరిపాలనలో జాప్యం జరిగి, బాధ్యతారాహిత్యం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతిపాదిత కొత్త వ్యవస్థ పూర్తిగా అధికార యంత్రాంగం (బ్యూరోక్రసీ) ఆధారంగా నడిచేలా రూపొందించారని, దీనివల్ల ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాత్ర విధాన రూపకల్పన, నిర్ణయాలు, అమలు మరియు పర్యవేక్షణ వంటి అంశాలలో గణనీయంగా తగ్గిపోతుందని మండిపడ్డారు. వార్డు కమిటీలను తప్పనిసరి చేస్తూ, వాటి నెలసరి సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను స్టాండింగ్ కమిటీ, కార్పొరేషన్ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. పౌర సమాజ సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల నిపుణులు, సామాజిక కార్యకర్తలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు ఆర్థిక, ప్రణాళిక, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, పర్యావరణం, పారిశుద్ధ్యం తదితర అన్ని కమిటీలలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు తప్పనిసరిగా చోటు కల్పించాలన్నారు. పూర్వ గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి కొనసాగుతున్న ఆస్తి పన్ను అసమానతలకు ఈ బిల్లులో ఎలాంటి పరిష్కార యంత్రాంగాన్ని చూపలేదు. పైగా క్యాపిటల్ వ్యాల్యూ ఆధారిత పన్ను విధానం వల్ల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ల శాఖ మార్గదర్శక విలువలు, వాస్తవ మార్కెట్ విలువల వ్యత్యాసాలను సరిచేయకపోగా.. ఆస్తుల కొనుగోలుదారులపై అధిక స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, సేవా పన్నుల భారం పడే అవకాశం ఉందన్నారు. అలాగే సేవల నాణ్యతకు గ్యారంటీ ఇవ్వకుండా, నీటి సరఫరా మరియు మురుగునీటి ఛార్జీలను ప్రతి సంవత్సరం ఆటోమేటిక్‌గా (స్వయం చాలకంగా) పెంచే ప్రతిపాదన సమంజసం కాదన్నారు. క్యూర్ ప్రాంతంలో పనిచేసే అన్ని ప్రభుత్వ శాఖలు, బోర్డులు, కార్పొరేషన్లు, ప్రజారంగ సంస్థలు, ఇతర ఏజెన్సీలు అన్నీ ఎన్నికైన కార్పొరేషన్ ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణలో పనిచేస్తూ, కార్పొరేషన్‌కు జవాబుదారీగా ఉండేలా చట్టంలో నిబంధనలు చేర్చాలని కౌన్సిల్ డిమాండ్ చేసింది. అలాగే ప్రోటోకాల్ ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు జాతీయ, రాష్ట్ర అధికారిక కార్యక్రమాలలో అనుసరించాల్సిన ప్రోటోకాల్‌ను బిల్లులో స్పష్టంగా నిర్దేశించాలని కోరారు. ఈ క్యూర్ బిల్లు కేవలం జీ.హెచ్.ఎం.సీ చట్టం 1955కు ప్రత్యామ్నాయంగా కాకుండా, నిజమైన ప్రజాస్వామ్య వికేంద్రీకరణను, పారదర్శకతను బలోపేతం చేసే విధంగా రూపొందాలని ది సిటీజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ప్రతినిధులు సీతారాం దూలిపాళ, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ మహమ్మద్, రామ సుబ్బారెడ్డి, విద్యా సాగర్, దిలీప్ కక్కడ, బదరీనాథ్, గోపాలకృష్ణ, రావు, అను కపూర్, శ్రీధర్ రెడ్డి, నరేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన నిరాహారదీక్ష కార్యక్రమం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** భారతదేశ యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర (బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏ ఐ సి సి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన నిరాహాదీక్ష కార్యక్రమం నిర్వహించనైనది. ముందుగా నిరాహార దీక్షలో కూర్చున్న నూతి సత్యనారాయణ గౌడ్ కు దండ అలంకరించి సంఘీభావం తెలిపిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదే విధంగా సంఘీభావంగా దీక్షలో కూర్చున్న వారికి ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న లు సంఘీభావం తెలిపారు. అదే విధంగా ఈ దీక్షలో నూతి సత్యనారాయణ గౌడ్ కు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ హుస్సేన్, విప్లవ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కర్నాటి రామారావు, కిలారు అనిల్ కుమార్, బచ్చలకూర నాగరాజు, మూడుముంతల





గంగరాజు యాదవ్, దామా స్వరూప, ప్రభావతి రెడ్డి, గాదెల ఝాన్సీ, శ్రీలత, శ్రీనివాస్ యాదవ్, వేల్పుల మురళి, అన్నపూర్ణ, లక్ష్మీ తదితరులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ భారతదేశ యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర (బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశ వ్యాప్తంగా తీసుకున్న ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమం, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఏ ఐ సి సి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల పిలుపు మేరకు నిర్వహించామని అదే విధంగా నీట్ పేపర్ లో లీకేజీ లు ఇది మొదటిసారి కాదని ఇంతకు ముందు కూడా జరిగిందని ఈ లీకేజి కారణంగా ఎంతో మంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని, విద్యార్థుల ఆత్మహత్య చేసుకొన్నారని అదే విధంగా కేంద్ర





(బీ జె పి) ప్రభుత్వం అనేక సందర్భాలలో రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ప్రజలు గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అనంతరం సాయంత్రం 04.00 గంటలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కు నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, పులిపాటి వెంకయ్య లు అదే కార్యక్రమ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ కోశాధికారి పులిపాటి వెంకయ్య, సహెలా జావేద్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగా జనార్ధన్, వనం ప్రదీప్త చక్రవర్తి(బాబు), మడు పల్లి భాస్కర్ గౌడ్, ప్రతిభారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ కమిటి సభ్యులు , కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-44పై నిత్యం ట్రాఫిక్ కష్టాలు..

### నిలిచిపోయిన లారీతో కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు

### మదనపల్లి--పాలమాకుల మధ్య గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్..

### ట్రాఫిక్ పోలీసుల జాడ లేక వాహనదారుల ఇక్కట్లు



గండిపేట(క్రైమ్ మిర్రర్): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఎన్‌హెచ్-44పై మదనపల్లి గ్రామం నుంచి పాలమాకుల గ్రామం వరకు హైదరాబాద్ వైపు శనివారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రహదారి మధ్యలో ఓ లారీ నిలిచిపోవడంతో కిలోమీటర్ల మేర కార్లు, బస్సులు, లారీలు వరుసగా నిలిచిపోయాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొన్నారు. ఘటన జరిగి ఇంత సమయం గడుస్తున్న ఇప్పటి వరకు పోలీసులు,కానీ ట్రాఫిక్ సిబ్బంది గాని అక్కడికిచేరుకోకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలకు వెళ్లే అంబులెన్స్‌లకు కూడా దారి లేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్--బెంగళూరు జాతీయరహదారి(ఎన్‌హెచ్-44)లో ఆరు వరుసల విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో తరచూ ఇలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు. రోడ్డు పనుల కారణంగా వాహనాల రాకపోకలు ఇప్పటికే నెమ్మదిగా సాగుతుండగా, ఒక వాహనం నిలిచిపోయినా వెంటనే భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్న పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు,పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని,రద్దీ సమయాల్లో ట్రాఫిక్ పోలీసులను అందుబాటులో ఉంచాలని వాహనదారులు ప్రభుత్వాన్ని, జాతీయ రహదారి అధికారులను కోరుతున్నారు. అప్పుడే నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.